# రాబందులను మించి ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీ !

నేటి నిజం
శుక్రవారం 10-7-2020

శవాన్ని పీక్కుతునే కుక్కలన్నా నయం...శవాలను పీక్కుతినే రాబందులు నయం.. అడవుల్లో జంతువులను వేటాడే పులులు,సింహాలు నయం...శవాలపై పేలాలు ఏరుకునే తినేవారు సైతం కూడా నయమే. కానీ మన ప్రైవేట్ ఆస్పత్రులు మాత్రం శవాలను, రాబందులను, కుక్కలను కూడా పీక్కుతినే రాబందులకన్నా దారుణంగా వ్యవహరిస్తున్న తీరు సభ్యసమాజం తలదించుకోవల్సిందే. వైద్యవృత్తితో సమాజంలో మంచి పేరు తెచ్చుకుని ప్రజల ప్రాణదాతలుగా నిలవాల్సిన వారు కరోనా మహమ్మారి కారణంగా అధ్వాన్నంగా తయారయ్యారు. అంతకుముందూ వారు నిజాయితీగా లేకున్నా..కనీసం ఈ కష్టకాలంలో అయినా వారు సామాజికి బాధ్యతగా వ్యవహరించి ఉంటే మంచిపేరు వచ్చేది. కానీ వారికి వైద్య సేవలతో సంపాదించే పేరుకన్నా..పీక్కుతినడం వల్ల వచ్చే డబ్బుపైనే మక్కువని తేలిపోయింది. దొంగబిల్లులు, అనవసర బిల్లలుతో కరోనా చికిత్సల కోసం వచ్చిన వారిని పీక్కుతింటున్న తీరు దారుణం కాక మరోటి కాదు. కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు కరోనా రోగుల నుంచి రూ. లక్షల్లో బిల్లులు వసూలు చేస్తున్నాయి. వారు వేసే బిల్లు చూస్తే ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఆక్సిజన్ పెట్టక పోయినా పెట్టినట్లు బిల్లు వేస్తున్నారు. వారం రోజుల క్రితం ఓ ప్రభుత్వ వైద్యురాలికి ఒక రోజుకే రూ.1.15 లక్షల బిల్లు వేసిన ఘటన మరవక ముందే మరో సంఘటన గచ్చిబౌలి ఏఐజీ ఆస్ప త్రిలో జరిగింది. డాక్టర్ అయిన కేసరి విజయ బిల్లులో అవకతవకలు, ఆస్పత్రి దౌర్జన్యంపై ఆమె వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ఇదెక్కడి న్యాయం, మాకు సాయం చేయండంటూ మంత్రి ఈటల రాజేందర్‌ను కోరారు. వీడియోలో ఆమె మాట్లాడుతూ అక్కడ జరుగుతున్న అకృత్యాలు, తనకు జరిగిన అవమానాలను తెలియచేశారు. కొవిడ్-19 పరీక్షలు చేసి పాజిటివ్ వచ్చిందని చెప్పడం..చికిత్స పేరుతో లక్షల్లో బిల్లుల వసూలు చేయడం ఎంతవరకు సమంజసమో ఆస్పత్రి యాజామాన్యం చెప్పాలి. వీళ్ల వ్యాపారధోరణి చూస్తే అసలు వీళ్లు మనుషులేనా అని...మానవత్వం ఉందా అనిపిస్తుంది. సమాజంలో మంచి డాక్టర్లుగా పేరు తెచ్చు కోవడం, అవార్డుల కోసం పైరవీలు చేయడం.. ఆస్పత్రులు కట్టుకుని ప్రజలను పీడించి వసూలు చేస్తున్న ఈ డబ్బు జబ్బుతో వారు కరోనా వ్యాధి సోకిన వారికన్నా అధ్వాన్నంగా చావాలని కోరుకుందాం. ప్రభుత్వ ఆస్పత్రులు నానాటికి తీసికట్టుగా తయార వుతున్న వేళ ప్రైవేట్ ఆస్పత్రులపై నమ్మకంతో వచ్చిన పేషెంట్లను జలగల్లా పీల్చి కొందరు..శవాలు ఇవ్వకుండా కొందరు.. చేస్తున్న వ్యాపారాలు చూస్తుంటే వైద్యవృత్తి ఎంతగా దిగజారిందో గమనించవచ్చు. చేయని వైద్యానికి ఎందుకు డబ్బులు చెల్లించాలి. కరోనా లక్షణాలు లేకపోయినా వైద్యం చేసినట్లు ఎందుకు బుకాయించాలి. ఆస్పత్రుల్లో సౌకర్యాలు లేకపోవడం, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వ్యాపార ధోరణి చూస్తుంటే సభ్య సమాజంలో ఉన్నామా అన్న ఆందోళన కలుగుతోంది. ఇది ప్రభుత్వాలకు తీరని మచ్చ. ప్రజల కోసమే పానల చేస్తున్నామని చెప్పక ుంటున్న వారు తలదించుకోవాలి. ఇలాంటి ఘటనలు జరగడం అత్యంత హేయమైన చర్యగా భావించి తగు చర్యలు తీసుకోవాలి. తెలంగాణలో కరోనా విజృంభణతో పరిస్థితి చేయి దాటి పోతుంది. ప్రైవేట్ ఆస్పత్రిలో దోపిడీ ఎక్కువ కావడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. లాక్‌డౌన్‌తో కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు కరోనా పేషెంట్ల శవాల మీద వ్యాపారం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళ సై స్వయంగా కల్పించుకుని సమీక్ష చేసినా మార్పు రాలేదు. ప్రైవేట్ ఆస్పత్రుల వారు తమ వ్యాపార ధోరణి వీడలేదు. వీలైనంతగా ప్రజలను భయపెట్టి డబ్బు గుంజాలన్నా పైశాచిక బుద్దిని వీడలేదు. ఈ వ్యవహారంలో ప్రభుత్వ యంత్రాంగం కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఇలాంటి సంఘటనలు అన్నీ సిఎంగా కెసిఆర్ మాత్రమే చూడాలని లేదు. అధికారులు చర్యలు తీసుకోవచ్చు. కానీ అలా చేయడం లేదు. కరోనా మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా విజృంభణ చేస్తోంది. ఆయా దేశాలు, రాష్ట్రాలు కట్టడికి తగు చర్యలు తీసుకుంటున్నాయి. ఎక్కడయితే కఠిన చర్యలు తీసుకుంటున్నారో కరోనా వ్యాప్తి అక్కడ తగ్గుముఖం పడుతోంది. ఈ క్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రోజురోజుకి కేసుల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరుగుతోంది. మరోవైపు గాలిద్వారా కూడా వైరస్ వ్యాప్తి చెందుతుందన్న ప్రముఖుల హెచ్చరికలు ఆందోళన కలిగించేలా ఉన్నాయి. ప్రమాద ఘంటికలు మోగుతున్న వేళ ఎవరికి వారు అప్రమత్తంగా ఉ ండాలి. ప్రజలు తమకు వైరస్ అంటుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ దశలో ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇష్టారాజ్యంగా చికిత్సలు నడుస్తున్నాయి. డబ్బు గుంజడమే లక్ష్యంగా వారు పనిచేస్తున్నారు. వాళ్లు వేసే బిల్లు కట్టనిదే పేషెంట్లను బయటకు పోనివ్వడం లేదు. శవాలను కూడా బంధువులకు అప్పగించడం లేదన్న ఆరోపణలు ఉ న్నాయి. గాంధీ ఆస్పత్రి ఇప్పటికే గందరగోళంగా మారి కరోనా రోగులు అక్కడ ఉండలేని పరిస్థితి వచ్చిందన్న ఆరోపణలు ఉన్నాయి. అక్కడ సరైన వసతులు లేవంటున్నారు. గాంధీ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న అనేక మంది రోగులు సెల్ఫీ తీసుకొని తమను అక్కడినుంచి తరలించమని ఏకంగా మంత్రులకే విజ్ఞప్తి చేస్తున్నారు. స్వయంగా రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ జోక్యంతో ఒకరిద్దరికి బెడ్లు ఇప్పించవలసింది వచ్చింది. తాజాగా ఒక జర్నలిస్టు ఆవేదన భరితమైన సెల్ఫీ వీడియో చూసి ఆర్థిక మంత్రి మంత్రి హరీష్ రావు స్వయంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అతడిని చేర్పించారు. ఇవన్నీ రోగుల దయనీయమైన పరిస్థితిని తెలుపుతున్నాయి. ప్రభుత్వ వైద్యం సరిగా అందకపోవడంతో డబ్బులు ఉన్నవాళ్లు కూడా అటు ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీని తట్టుకోలేక పోతున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల యజమానులు ఇదే అదనుగా వైద్యం పేరుతో సేవలను అమ్ము కుంటున్నారు. ప్రాణాలు కాపాడాల్సిన వారే నిర్లాక్షణ్యంగా డబ్బుల కోసం కక్కుర్తి పడితే ఇక ప్రజలు ఏం చేస్తారు. ప్రైవేట్ ఆస్పత్రుల దాష్టీకంపై కఠిన చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించాలి. నిర్ణయించిన రేట్లకే వైద్య సేవలు అందేలా చూడాలి. లేకుంటే ఏదో ఒకరోజు ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని గుర్తుంచుకోవాలి.

## పెళ్లిళ్లు,అంత్యక్రియలకు ఇక పోలీసు అనుమతి

### -ఒడిషా ప్రభుత్వం ఆదేశాలు జారీ

భువనేశ్వర్,జూలై9(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ విజృంభణ నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. పెళ్లిళ్లు, అంత్యక్రియలకు పోలీసుల అనుమతి తప్పనిసరి చేసింది. ఈ రెండు కార్యక్రమాలకు ముందే పోలీసుల అనుమతి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. వివాహాలకు 50 మంది, అంత్యక్రియలకు 20 మందికి మాత్రమే అనుమతి ఇస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. పోలీసులకు నేరుగా లేదా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చు అని అధికారులు తెలిపారు. ఒడిశాలో ఇప్పటి వరకు 10,624 పాజిటివ్ కేసులు నమోదు కాగా, 61 మంది ప్రాణాలు కోల్పోయారు. మొత్తం పాజిటివ్ కేసుల్లో 3,557 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఈ వైరస్ నుంచి 7,006 మంది కోలుకుని డిశ్చార్జి అయ్యారు.

## భార్యను హత్య చేసి ఆత్మహత్య

### -జీవిత ఖైదు అనుభవిస్తున్న వ్యక్తి దుర్మార్గం

సంగారెడ్డి,జూలై9(ఆర్ఎన్ఎ): కట్టుకున్న భార్యను హత్య చేసి ఆపై ఓ వ్యక్తి తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లాలోని నారాయణరెడ్డి కాలనీలో చోటు చేసుకుంది. భార్య ప్రవంతిని భర్త శంకర్ దారుణంగా హత్య చేశాడు. ఆపై తాను కూడా ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత అర్ధారాత్రి జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. ఆత్మహత్య చేసుకున్న శంకర్ పాత నేరస్థుడని... ఇటీవలే జైలు నుంచి బయటకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. 2013లో ఓ హత్య చేసిన శంకర్‌కు న్యాయస్థానం యావజ్జీవ శిక్ష విధించింది. జిల్లా జైలులో శంకర్ మూడేళ్లుగా శిక్ష అనుభవిస్తున్నాడు. మృతుడు శంకర్ ఆర్టిస్టు కావడంతో జైల్‌లో అధికారులు బొమ్మలు వేయించారు. జైలులో శంకర్ సత్ప్రవర్తన కారణంగా జూన్ 25న అతడిని జైలు అధికారులు పెరోల్‌పై విడుదల చేశారు. జూలై 11తో పెరోల్ గడువు ముగియనుంది. జైలు నుంచి విడుదలై ఇంటికి వచ్చిన శంకర్...భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో గత రాత్రి ఆమెను కత్తితో పొడిచి హత్య చేశాడు. తరువాత జీవితం విరక్తి చెంది శంకర్ ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని దగ్గర దొరికిన లేఖ ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు.

## నీట్ పీజీ డెంటల్ కోర్సులకు నోటిఫికేషన్

### 12న ముగియనున్న ఆన్‌లైన్ గడువు

వరంగల్,జూలై9(ఆర్ఎన్ఎ): నీట్ పీజీ డెంటల్ కోర్సుల్లో ప్రవేశాలకు కాళోజీ హెల్త్ వర్సిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. పీజీ డెంటల్ కటాఫ్ మార్కులు తగ్గడంతో అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరింది. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం నీట్ 2020-2021 పీజీ అర్హత కటాఫ్ స్కోర్‌ను 18.935 పర్సంటైల్ తగ్గించింది. దీని ప్రకారం జనరల్ అభ్యర్థులు 31.065 పర్సంటైల్ 220 మార్కులు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కోటాలో 21.065 పర్సంటైల్ 188 మార్కులు, దివ్యాంగులు 26.065 పర్సంటైల్ 204 మార్కులు సాధించిన వారు అర్హులని అని తెలిపింది. ఈ సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తున్నామని, ఆన్‌లైన్ అప్లికేషన్లకు ఈ నెల 12న గడువు ముగుస్తుందని వెల్లడించింది. దరఖాస్తులు, ఇతర వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ లో చూడవచ్చని పేర్కొంది.

## డివైడర్‌ను ఢీకొని అదుపుతప్పిన కారు

### ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి

అనంపతురం,జూలై9(ఆర్ఎన్ఎ): అనంతపురం జిల్లా రాప్తాడు సమీపంలోని గొల్లపల్లిలో రోడ్డు ప్రమాదం జరిగింది. కారు బోల్తాపడిన ఘటనలో ముగ్గురు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లా సింగనమల మండలం ఆకులేడు గ్రామానికి చెందిన ఒకే కేటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ఇన్నోవా వాహనంలో బెంగళూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో గొల్లపల్లి సమీపంలోని రాగానే వీరు ప్రయాణిస్తున్న ఇన్నోవా వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి.. బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అమర్‌నాథ్ (40), రాజు (28), చెన్నమ్మ(65)లు అక్కడిక్కడే మృతి చెందగా.. మరొకరికి తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో రాప్తాడు ఎస్సై ఆంజనేయులు ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రుడ్ని స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

## జిమ్‌లకు అనుమతి ఇవ్వాలి

### జబల్‌పూర్‌లో అసోసియేషన్ల ప్రదర్శన

భోపాల్,జూలై9(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో జిమ్‌లు తిరిగి తెరిచేందుకు అనుమతి ఇవ్వాలంటూ మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జిమ్‌ల యజమానులు, ఫిట్‌నెస్ ట్రైనర్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి సచిన్ యాదవ్ మాట్లాడుతూ గత మూడు నాలుగు నెలలుగా జిమ్ యజమానులు, ట్రైనర్లు ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. దుకాణాల అద్దెలు చెల్లించడం కష్టంగా ఉందని తెలిపారు. మాలో చాలా మంది జిమ్‌లు అద్దెకు తీసుకున్న స్థలాల్లోనే నిర్వహిస్తున్నారని, వాటికి తెరవకున్నా కిరాయి చెల్లించాల్సి వస్తుందని పేర్కొన్నారు. లాక్‌డౌన్‌లోనూ అద్దె రూ. 20వేలనుంచి రూ. 2లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుందని, ఇవి కాకుండా కరెంటు బిల్లులు, సిబ్బంది, ట్రైనర్ల జీతాలు చెల్లించాల్సి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తిరిగి జిమ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్లు తెరిచేందుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

# తెలంగాణలో డేంజర్ బెల్స్ మోగిస్తున్న కరోనా

### రోజురోజుకూ అంతటా విస్తరిస్తున్న మహమ్మారి

### జాతీయ విధానం లేకుండా బిజెపి విమర్శలు

### గ్రేటర్ పరిధిలో ర్యాపిడ్ టెస్టులతో కలగనున్న ఊరట

హైదరాబాద్,జూలై9(ఆర్ఎన్ఎ): ఇప్పటికే తెలంగాణలో కరోనా విజృంభిస్తోంది. ఎవరికి వారు తగు జాగ్రత్తలు తీసుకోకుంటే వైరస్ మరిన్ని ప్రాంతాలకు వ్యాపించే ప్రమాదం దగ్గరలోనే ఉంది. వైరస్ మండల కేంద్రాలకు పల్లెలకు కూడా వ్యాపించే ప్రమాదం ఉంది. తెలంగాణలో పరీక్షలు తక్కువగా జరగడం వల్ల కేసుల సంఖ్య ఎంతన్నది తేలడం లేదు. ఇప్పటిదాకా హైదరాబాద్ నగరం దాని చుట్టుపక్కల రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలో మాత్రమే కేసుల సంఖ్య పెరిగింది. కానీ కొన్ని రోజులుగా తెలంగాణ రాష్ట్రంలో పెద్ద పట్టణాలైన నిజామాబాద్, వరంగల్, నగరాలలో కూడా కేసుల సంఖ్య బాగా పెరుగుతోంది. నగరాలు పట్టణాలలో మాత్రమే కాకుండా ఇక పల్లెలకు కూడా వ్యాధి విస్తరించే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, తమిళనాడు రాష్ట్రాల తర్వాత కరోనా పాజిటివ్ కేసుల విషయంలో తెలంగాణ ఐదవ స్థానానికి చేరింది.

కరోనా కట్టడి చర్యల్లో జాతీయ విధానం అవలంబించకుండా బిజెపి రాజకీయాలు చేస్తోంది. దేశమంతా సుభిక్షంగా ఉన్నట్లు ఒక్క తెలంగాణాలోనే అంతా ఆగమైనట్లు ప్రవర్తిస్తుంది. కేంద్రం నుంచి రాష్ట్రాలకు ఏదో దయాదాక్షిణ్యాలతో డబ్బులు ఇచ్చామని కేంద్ర హోం మంత్రి కిషన్ రెడ్డి స్వయంగా ప్రకటించారు. సాయం చేస్తున్నా తెలంగాణ విఫలం అవుతందన్న రీతిలో ప్రకటనలు గుప్పస్తున్నారు. ప్రజలకు కావాల్సింది విమర్శలు కాదు..ప్రజల ప్రాణాలను కాపాడడం ముఖ్యం అని పాలకులు గుర్తించాలి. ఇలాంటి సంక్షోభ సమయంలో రాజకీయాలు చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచన చేయాలి. ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయాలు మాట్లాడితే అభ్యంతరం లేదని మంత్రి కెటిఆర్ కూడా ఘటుగానే సమాధానం ఇచ్చారు.ఇప్పుడు ఎన్నికల రాజకీయాలకు సమయం కాదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి బాధ్యతగా కరోనా మహమ్మారి ఎదుర్కొని ఏ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నదని చూడకుండా వెంటనే యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు ప్రారంభించాలి. ప్రజల ప్రాణాలు రక్షించని ప్రభుత్వాలు ఎందుకు అని ప్రజలు ప్రశ్నించకుండా చూడాలి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా కరోనా చికిత్సను ఆరోగ్యశ్రీలో చేర్చి తక్షణం ఆదేశాలు ఇస్తే ప్రజలకు భరోసా దక్కగలదు. కనుక ప్రజలు కూడా వ్యాక్సిన్ వచ్చేదాకా డాక్టర్లు చెప్పే సలహాలు పాటించి తగిన జాగ్రత్తలు తీసుకొని తమ తమ ఇళ్లకే పరిమితమై వైరస్ వ్యాప్తిని అరి కట్టాలి. పెరుగుతున్న కరోనా కేసులతో భయపడుతున్న గ్రేటర్ హైదరాబాద్ వాసులకు శుభవార్త అందించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ర్యాపిడ్ యాంటిజెన్ కొవిడ్-19 పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ టెస్టుల ద్వారా కేవలం అరగంటలోనే ఫలితం తెలుసుకోవచ్చు. ఒక్కో ఆరోగ్య కేంద్రం పరిధిలో 25 మందికి పరీక్షలు చేయనుండగా, తొలి రోజు మూడు జిల్లాల్లో ఆరేడు వందల మందికి పరీక్షలు నిర్వహించినట్టు ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో 50 అర్బన్ హెల్త్ సెంటర్లు, రంగారెడ్డి జిల్లాలో 20, మేడ్చల్‌లో 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు రివర్స్ ట్రాన్స్‌క్రిప్షన్ పాలిమరేజ్ చైన్ రియాక్షన్ (ఆర్‌టీ-పీసీఆర్) విధానంలో కరోనా పరీక్షలు చేయగా, ఇప్పుడు ర్యాపిడ్ యాంటిజెన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ విధానంలో తొలిసారి పాజిటివ్ ఫలితం వస్తే రెండోసారి పరీక్షలు చేయించుకవాల్సిన అవసరం ఉండదు. అయితే, నెగటివ్ వస్తే మాత్రం ఆర్‌టీ-పీసీఆర్ పరీక్ష చేయించుకుని ధ్రువీకరించుకోవాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

# గిరిజన గ్రామాల్లో కరెంట్ వెలుగులు

### తక్కువ ఖర్చుకే విద్యుత్ సరఫరా

భూపాలపల్లి,జూలై9(ఆర్ఎన్ఎ): అటవీ ప్రాంతంలో జీవనం సాగిస్తూ సూర్యోదయం తప్ప విద్యుత్ వెలుగులు చూడక ... అరకొర వసతులతో జీవనం సాగించే... గిరి పుత్రుల జీవితాల్లో ప్రధాని చేపట్టిన దీనదయాల్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన వెలుగులు ప్రసరింపజేస్తుంది.... అతి తక్కువ ఖర్చుతో వారికి విద్యుతు మీటర్ అందిస్తున్నది. మరో కుంభమేళ గా పిలువబడే సమ్మక్క సారలమ్మ జాతరలో సారలమ్మ ఆవిర్భవించిన కన్నేపల్లి గ్రామం ఒక మారుమూల కుగ్రామం. మేడారం జాతరకు 5 కి మీ దూరం లో 250 కుటుంబాలు గల ఈ గ్రామం సరయిన అభివృద్ధికి నోచుకోకపాయిన ఇక్కడ అమ్మను నమ్ముకుని జీవించే వారే ఎక్కువ... అలంటి వారి జీవితాలోకి ప్రతి ఇంటికి విద్యుధ్యుత్ ఉండాలనే ప్రధాని సంకల్పంతో ఏర్పడిన దీన్ దయాల్ ఉపాధ్యాయ్ గ్రామా జ్యోతి పథకం వెలుగులు నింపుతుంది .

తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ జిల్లా జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఒక మారుమూల ప్రాంతం. ఈ జిల్లలో ఎక్కువ శాతం గిరిజనులు జీవనం సాగించే అటవీ ప్రాంతం.. కేంద్ర ప్రభుత్వం మారుమూల జిల్లాల అభివృద్ధి పథకంలో బాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఎంపిక చేసిన మూడు జిల్లాలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఒకటి. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండే ఈ జిల్లాను కేంద్ర అభివృద్ధి పథకంలో ఎంపిక చేయడంతో జిల్లాలోని మారుమూల ప్రాంతాలు మౌలిక వసతుల ఏర్పాటులో పరుగులు తీస్తున్నాయి. ఈ జిల్లలో గ్రామాస్వరాజ్ యోజనలో భాగంగా 192 గ్రామాలూ ఎంపిక కాగ అక్కడ నివసించే వారికి కావలసిన వసతులను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామస్వరాజ్ యోజన ద్వారా పల్లెలు మౌలిక వసతుల అభివృద్దిలో ముందడుగు వేస్తున్నాయి. కేంద్రం దీన్ దయాల్ ఉ పాధ్యాయ గ్రామా జ్యోతి యోజన పథకం ద్వారా కేవలం 125 రూపాయలు చెల్లిస్తే సుమారు 3250 రూపాయల విలువ చేసే సర్వీసు వైర్ కట్ అవుట్ , కరెంట్ మీటర్, ఎల్ఈడి బల్బ్ అందిచడంతో పాటు వారి ఇంటి వరకు కరెంట్ పోల్ వేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వనుండడంతో పల్లె ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కరోనా కోరల్లో జర్నలిస్టులు

### ఆందోళనలో కుటుంబాలు

హైదరాబాద్,జూలై9(ఆర్ఎన్ఎ):వృత్తిగతంగా ఈ మధ్య జర్నలిస్టులు కూడా కరోనా బారిన పడుతున్నారు. అనేకమంది వైరస్ బారిన పడి ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల టీవీ జర్నలిస్ట్ మనోజ్ కరోనాతో మృత్యువాత పడ్డారు. తరవాత అనేకమంది కరోనాతో చికిత్స పొందుతున్నారు. తాజాగా శ్రీనివాసరెడ్డి అనే జర్నలిస్టు కరోనాతో ఇబ్బంది పడుతుండగా మంత్రి హరీస్ రావు చొరవత ఆయనను చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అలాగే మీడియా అకాడమీ తరపున చైర్మన్ అల్లం నారాయణ ఇప్పటికే పలువురికి ఆర్థిక సాయం అందించారు. అయినా ఇంకా రాష్ట్రంలో అనేకమంది కరోనా బారిన పడి సాయం అందక ఆందోళన చెందుతున్నారు. ఇదిలావుంటే భద్రాచలంలో పనిచేస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ కమల్ రెడ్డి విధి నిర్వహణలో భాగంగా ఓ రాజకీయ నేతకార్యక్రమ కవరేజీకి వెళ్లాడు. ఆ తర్వాత పరిణామాల్లో రాజకీయ నేతకు కరోనా పాజిటివ్ గా తేలడంతో అనుమానం వచ్చిన జర్నలిస్టు సోదరుడు తాను కూడా స్వచ్ఛందంగా కరోనా టెస్ట్ చేయించుకున్నాడు. రెండు రోజుల క్రితం రిపోర్ట్ పాజిటివ్‌గా వచ్చింది. ఇక అప్పటి నుండి ఆ జర్నలిస్టుకుటుంబంలో మొదలైన కరోనా కష్టాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పాజిటివ్ విషయం తెలుసుకున్న భద్రాచలం ప్రభుత్వవైద్యులు కమల్ ఇంటికి వచ్చి కొన్ని మందులు ఇచ్చి ఇంటి వద్దనే ఉండమని సూచించారు. సాయంత్రానికి కమల్ భార్య, రెండేళ్ల కూతురుకు జ్వరం లక్షణాలు కనిపించాయి. దీంతో ఆందోళనకు గురైన జర్నలిస్టు సోదరుడు తమ కుటుంబంలోని మిగిలినవారికి కూడా కరోనా టెస్టులునిర్వహించాలని అధికారులకు విన్నవించాడు. ఎవరూ పట్టించుకోక పోవడంతో తీవ్రమైన ఆందోళనకు గురయ్యాడు. రెండు రోజులు గడుస్తున్నా స్థానికంగా స్పందన లేకపోవడంతో కుటుంబాన్ని తీసుకుని వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. మాములు పేషెంట్ కాకపోవడంతో ప్రభుత్వం పంపే అంబులెన్స్ కోసం ఆదివారం ఉదయం నుండి ఎదురుచూసాడు. రాత్రి సమయానికి వచ్చిన అంబులెన్స్‌లో తన భార్య, కుతురు గుండెజబ్బుతో బాధపడుతున్న తండ్రిని తీసుకుని భారీ వర్షంలో బయల్దేరాడు. అంబులెన్స్ కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ దగ్గరకు రాగానేటైర్ పంక్చర్ కావడంతో ఆగిపోయింది. అర్ధరాత్రి వర్షంలో ఏంచేయాలో తెలియక అంబులెన్స్‌ను తాత్కాలికంగా మరమత్తులు చేసుకుని సమీపంలో ఉన్న కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి వెళ్లాడు. సోమవారం ఉదయం అధికారులు వచ్చి భార్య,కుతురుకి కరోనా టెస్టులు చేయాల్సి ఉన్నందున వారిని కొత్తగూడెంలోనే ఉంచి, పాజిటివ్ వచ్చిన కమల్ ను హైదరాబాద్ వెళ్లాల్సిందిగా కోరారు. ఓవైపు చిన్నారి కూతురు, భార్య మరోవైపు గుండె జబ్బుతో బాధపడుతున్న తండ్రిని అక్కడే వదిలేసిన కమల్ హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి భారంగా బయల్దేరాడు. ఇలా ఎందరో ఆస్పత్రులకు వస్తున్నారు. ఎవరికి వారు తమకున్న సమాచారాన్ని ఇతరులకు చేరవేసి,తమకున్న పరిచయాలతో ఆదుకోవాల్సి ఉంది. తెలంగాణ జర్నలిస్ట్ జాక్ తమవంతుగా ప్రభుత్వంతో చర్చించే ప్రయత్నాల్లో ఉంది. ఈ మేరకు కన్వీనర్ దేవరకొండ కాళిదాస్, కో కన్వీనర్ అవ్వారు రఘులు ప్రయత్నాలు చేస్తున్నారు. వీలున్న వారు మీడియా అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణకు కూడా సంప్రదించి తగిన సాయం పొందితే మంచిది.

## ఎపిలో 25కోట్ల మొక్కలు నాటే లక్ష్యం

### ఆర్కె బీచ్‌లో మొక్కలు నాటిన విజయసాయి

విశాఖపట్నం,జూలై9(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో 25 కోట్ల మొక్కలను పెంచాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి తెలిపారు. విశాఖ ఆర్కె బీచ్‌లో కోతని అరికట్టేందుకు జీవీఎంసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. సన్ రే రిసార్ట్స్‌తో కలిసి స్కేవోలా టకాడా మొక్కలు నాటే ప్రక్రియ గురువారం ప్రారంభమయింది. ఈ సందర్భంగా ఎంపీ విజయసాయిరెడ్డి బీచ్ రోడ్డులో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాస్, వీఎంఆర్డీఏ ఛైర్మన్ ద్రోణం రాజు శ్రీనివాస్, కలెక్టర్ వినయ్‌చంద్, జీవీఎంసీ కమిషనర్ సృజన, సన్‌రే రిసార్ట్స్ ఎండీ రాజబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ నౌపాక మొక్కల్లో ఎన్నో ఔషధ గుణాలున్నాయని, బీచ్‌లో మొక్కలు నాటడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. విశాఖలో ఉష్ణోగ్రత తగ్గేందుకు ఈ మొక్కలు దోహద పడతాయన్నారు. నగరంలో 2 కోట్ల మొక్కలను నాటాలని నిర్ణయించామని వెల్లడించారు. మంత్రి అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యాటకులకు స్వర్గధామం విశాఖ అని, రాబోయే రోజుల్లో నౌపాక మొక్కలు పర్యాటకులకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయన్నారు.

## ఉఘర్ మైనార్టీలకు చైనా వేధింపులు

### కిడ్నాపులు, అత్యాచారాలు నిత్యకృత్యం

### అమెరికా సామాజికవేత్త రుషాన్ అబ్బాస్ ఆందోళన

న్యూఢిల్లీ,జూలై9(ఆర్ఎన్ఎ): చైనాలోని జిన్‌జియాంగ్ ప్రాంతంలో ఉఘర్ ముస్లిములను నిర్బంధించి వారిపై అత్యాచారానికి పాల్పడుతూ బలవంతంగా పెళ్లి చేసుకుని జనాభాను పెంచుకునే ప్రయత్నం చేస్తున్నా రంటూ ఏళ్ల తరబడి వాదనలు వినిపిస్తున్నాయి. ఇలా ఎన్నో దారుణాలకు అడ్డాగా మారిన కాన్సంట్రేషన్ క్యాంపు చైనా తొలిసారిగా 2014లో నిర్మించారు. ఆరేళ్లలో ఇవి విస్తరిస్తూ 500 శాతం పెరిగాయి. సాటిలైట్ చిత్రాలు కూడా ఇదే విషయాన్ని వెల్లడిస్తున్నాయి. అయితే ప్రభుత్వం మాత్రం వీటిని ఎడ్యుకేషన్ క్యాంపులుగా బుకాయిస్తోంది. మైనారిటీలను చైనా ప్రభుత్వం హింసిస్తోందని అమెరికా సామాజికవేత్త రుషాన్ అబ్బాస్ పేర్కొన్నారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. 2018లో సెప్టెంబర్ 28న తన సోదరి, మెడికల్ డాక్టర్ గుల్షాన అబ్బాస్‌ను చైనా ప్రభుత్వం కిడ్నాప్ చేసిందని, ఇప్పటివరకు తన గురించి ఎలాంటి సమాచారం లేదన్నారు. అయితే దీనికి గల కారణం కూడా తెలీదని,

కనీసం తనపై ఎలాంటి కేసు కూడా నమోదు కాలేదని తెలిపారు. తన స్నేహితురాళ్లను సైతం కాన్సంట్రేషన్ క్యాంపులో నిర్బంధించిందని ఆరోపించింది. చైనాలో అడుగంటిపోతున్న మానవ హక్కుల కోసం తాను గళమెత్తి ప్రశ్నించినందుకు ప్రతీకారంగా డ్రాగన్ దేశం ఈ అరాచకానికి పూనుకుందని తెలిపారు. తన మతానికి చెందిన వారిపై చైనా దుర్మార్గానికి పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 1949లో మా భూమిని ఆక్రమించినప్పటినుంచి కమ్యూనిస్ట్ చైనా వివిధ సాకులను చూపుతూ ఉఘర్ ముస్లింలను టార్గెట్ చేస్తోంది. ఇప్పుడు అది తీవ్ర స్థాయికి చేరుకుంది. అక్కడి అధికారులు వారిని శారీరకంగానూ, మానసికంగానూ చిత్రహింసలు పెడుతారు. సరైన తిండీ, నీళ్లు ఇవ్వరు. సరిగా నిద్ర కూడా పోనివ్వరు. ఈ శిబిరాల నుంచి బయటకు వచ్చే చాలా మంది మహిళలకు పిల్లలు పుట్టకుండా గర్భాన్ని తీసివేస్తారు. ఇప్పటికీ అక్కడి రహస్య క్యాంపుల్లో 3 మిలియన్ల మంది ఉఘర్ మహిళలు మగ్గిపోతున్నారు. ఆ దేశ ఎకానమీ కోసం వీరిని కట్టుబానిసలుగా వినియోగించుకుంటున్నారని రుషాన్ పేర్కొన్నారు.

## చెన్నైలో దారుణ ఘటన

### కిరాయి అడిగినందుకు చంపేశాడు

చెన్నై,జూలై9(ఆర్ఎన్ఎ): కిరాయి కట్టమని అడిగినందుకు యజమానిని కాటికి పంపిన ఘటన తమినాడులోని చెన్నైలో జరిగింది. చెన్నైలోని కుంద్రతూర్ ప్రాంతంలో ధన్‌రాజ్ అనే వ్యక్తి ఓ ఇంట్లో కిరాయికి ఉంటున్నాడు. లాక్‌డౌన్ కారణంగా నాలుగు నెలలుగా ఇంటి కిరాయి చెల్లించేదు. దీంతో ఇంటి యజమాని గుణశేఖర్ కిరాయి చెల్లించమని అడుగుతూ వస్తున్నాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య తరచు గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండు వాయిదాల్లో కిరాయి సొమ్ము చెల్లించాలని ఒప్పందానికి వచ్చారు. అయినా ధన్‌రాజ్ డబ్బులు ఇవ్వలేకపోయాడు. దీంతో నిన్న ఇంటి యజమాని గుణశేఖర్ వారిని కిరాయి డబ్బులు ఇవ్వాలని కోరాడు. ఇద్దరి మధ్య చిన్న గొడవ జరిగింది. గుణశేఖర్ ప్రతిసారి ఇంటికి వచ్చి గొడవచేస్తుండటంతో ధన్‌రాజ్ కొడుకు అజిత్ అతనిపై కోపం పెంచుకున్నాడు. ఆవేశంతో ఉన్న అతడు నిన్న అర్ధరాత్రి గుణశేఖర్‌పై దాడి చేసి, పొడిచి చంపేశాడు. గుణశేఖరు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అజిత్‌ను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెన్నై: అద్దె అడిగాడని ఇంటియజమానినే చంపాడు ఓ అద్దెదారు కొడుకు. ఈ ఘటన చెన్నైలోని కుంద్రటూరులో చోటు చేసుకుంది. నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గత నాలుగు నెలలుగా అద్దె చెల్లించకపోవడం ఇంట్లో అద్దెకు ఉంటున్న ధనరాజ్‌తో యజమాని గుణశేఖర్ (51) గొడవపడ్డాడు. దీంతో ధనరాజ్ కుమారుడు అజిత్ కోపం పట్టలేకపోయాడు. అర్ధరాత్రి యజమాని గుణశేఖర్ ఇంటికి వెళ్లి కత్తితో దాడి చేసి చంపేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## కాంగ్రెస్ ట్రస్టులపై దర్యాప్తు కమిటీ

### కేంద్ర నిర్ణయంపై మండిపడ్డ రాహుల్

### మా నిజాయితీని శంకించలేరని ఘాటు వ్యాఖ్య

న్యూఢిల్లీ,జూలై9(ఆర్ఎన్ఎ): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తీవ్రంగా విరుచుకుపడ్డారు. గాంధీ కుటుంబానికి అనుబంధం గల మూడు ట్రస్టులపై దర్యాప్తు జరిపించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో రాహుల్ గాంధీ ట్విటర్ వేదికగా మోదీపై పదునైన విమర్శలు గుప్పించారు. తనను, కాంగ్రెస్ పార్టీని ఎవరూ బెదిరించలేరని స్పష్టం చేశారు.

రాహుల్ బుధవారం ఇచ్చిన ఓ ట్వీట్‌లో, లోకమంతా తనలాగే ఉందని మిస్టర్ మోదీ నమ్ముతున్నారు. ప్రతి వారికీ ఓ ధర ఉందని, బెదిరించగలమని ఆయన అనుకుంటున్నారు. సత్యం కోసం పోరాడేవారికి ధర ఉండదని, వారిని బెదిరించడం సాధ్యం కాదని ఆయనకు ఎన్నటికీ అర్థం కాదని దుయ్యబట్టారు.

అంతకుముందు కాంగ్రెస్ స్పందిస్తూ, గాంధీ కుటుంబానికి అనుబంధంగల మూడు ట్రస్టులపై దర్యాప్తును సమన్వయపరిచేందుకు ఇంటర్ మినిస్టీరియల్ ప్యానెల్‌ను ఏర్పాటు చేయడం పక్షపాతంతో కూడుకున్నదని ఆరోపించింది. బీజేపీకి, ఆ పార్టీ నేతలకు అనుబంధంగల సంస్థలపై ఎందుకు దర్యాప్తు చేయడం లేదని నిలదీసింది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ బుధవారం ఇంటర్ మినిస్టీరియల్ కమిటీని ఏర్పాటు చేసి, మూడు ట్రస్టులపై దర్యాప్తును సమన్వయ పరచాలని నిర్ణయించింది. రాజీవ్ గాంధీ ఫౌండేషన్, రాజీవ్ గాంధీ చారిటబుల్ ట్రస్టు, ఇందిరా గాంధీ మెమోరియల్ ట్రస్టు మనీలాండరింగ్ చట్టం, ఆదాయపు పన్ను చట్టం, విదేశీ విరాళాల చట్టాలను ఉల్లంఘించినట్లు వచ్చిన ఆరోపణలపై దర్యాప్తును ఈ కమిటీ సమన్వయపరుస్తుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్పెషల్ డైరెక్టర్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు.

# ఉద్యోగుల భవిష్య నిధికి కేంద్రం భరోసా

## జూన్ నుంచి ఆగస్టు వరకు చెల్లించనున్న కేంద్రం

## కేబినేట్ నిర్ణయాన్ని వెల్లడించిన ప్రకాశ్ జవదేకర్

న్యూఢిల్లీ,జూలై9(ఆర్ఎన్ఎ): ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్)పై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ నుంచి ఆగస్టు వరకు మరో మూడు నెలల పాటు చందాను చెల్లించేందుకు కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. దీంతో 72లక్షల మంది ఉద్యోగులకు లబ్ది చేకూరనున్నది. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన, భారత్ ఆత్మనిర్భర్ కింద ఈ జూన్ నుంచి ఆగస్టు వరకు మరో మూడు నెలల పాటు ఈపీఎఫ్ కంట్రిబ్యూషన్ 24శాతం అంటే 12 శాతం ఉద్యోగుల వాటా, 12 శాతం యజమానుల వాటా పొడిగించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ కేబినెట్ సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. వంద మంది కంటే తక్కువ ఉద్యోగులున్న సంస్థలు, రూ. 15వేల కంటే తక్కువ వేతనం పొందున్న కార్మికులు, ఉద్యోగులు, యజమానుల వాటా పీఎఫ్‌ను కేంద్రం మూడు నెలల పాటు చెల్లిస్తుంది. ఈ చర్యతో 72 లక్షల మంది ఉద్యోగులకు ప్రయోజనం కలిగిందని జవదేకర్ తెలిపారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజనను మరో ఐదు నెలల పాటు పొడిగించేందుకు కూడా కేబినెట్ ఆమోదముద్ర వేసినట్లు చెప్పారు. దీంట్లో 81 కోట్ల మందికి 203 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు నవంబర్ వరకు కేటాయించనున్నట్లు చెప్పారు. గత మూడు నెలల్లో 120 లక్షల టన్నులు పంపిణీ చేశామని చెప్పారు. గతంలో నాలుగు 4.60లక్షల టన్నుల పప్పు ఇవ్వగా, ఇప్పుడు 9.70లక్షల టన్నులు ఇవ్వనున్నట్లు వివరించారు.

# నిర్లక్ష్యం వల్లనే పద్మారావుకు కరోనా

## -ఎవరికి వారు స్వీయనియంత్రాణ పాటించాలి: కెటిఆర్

కరీంనగర్,జూలై9(ఆర్ఎన్ఎ):ఎవరూ కూడా నాకు కరోనా రాదనే అపోహతో ఉండొద్దని ఇందుకు ఉదాహరణెలి డిప్యూటీ స్పీకర్ పద్మారావు అని మంత్రి కెటిఆర్ అన్నారు. తాను ఓ కార్యక్రమానికి ఆయనతో కలిసి హాజరయినపుడు మాస్కు పెట్టుకోమంటే నాకు కరోనా రాదు అన్నారు. కానీ మరుసటి రోజే కరోనా వచ్చిందని కేటీఆర్ చెప్పారు. పెద్దపెద్ద దేశాలే కరోనా కేసులు పెరగడం వల్ల కట్టడి చేయలేక చేతులు ఎత్తేశాయన్నారు. కోవిడ్-19 కట్టడికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. బుధవారం కరీంనగర్ లోని ప్రతిమ మెడికల్ కళాశాలలో మంత్రి మొబైల్ ఆసుపత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలు ఎవరికి వారే జాగ్రత్తలు తీసుకొని నియంత్రణ చేసుకోవాలని చెప్పారు. ఇలాంటి సమయంలో విమర్శలు చేయడం వల్ల ప్రజలు అయోమయంకు గురి అయ్యే అవకాశం ఉందన్నారు. కరోనా పై పోరాటం చేస్తున్న వైద్యులు,పోలీసులను నిరుత్సాహపరిచే విధంగా విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. కరోనా వ్యాక్సిన్ తొందర్లోనే రావాలని కోరుకుంటున్నానని, అది కూడా మన తెలంగాణ రాష్ట్రం నుండే దేశానికి అందించాలని ప్రార్థిస్తున్నానని కేటీఆర్ చెప్పారు.

# కుల్‌భూషణ్ యాదవ్ విషయంలో కొత్త ఎత్తులు

## -రివ్యూ పిటిషన్‌తో ఉరితీసేందుకు పాక్ కుట్ర

ఇస్లామాబాద్,జూలై9(ఆర్ఎన్ఎ): పాక్ చెరలో ఉన్న మాజీ సైనికాధికారి కుల్ భూషణ్ జాదవ్ ను ఉరితీసేందుకు పాక్ కుట్రలు పన్నుతోంది. ఇరాన్ లో వ్యాపారం చేసుకుంటున్న కుల్ భూషణ్ జాదవ్ ను ఉగ్రవాదం నెపంతో అరెస్ట్ చేసి పాక్ కు తీసుకొచ్చారు. 2016 లో ఆయన్ను పాక్ అదుపులోకి తీసుకొని 2017 ఏప్రిల్ లో మరణశిక్ష విధించింది. దీనిని పూర్తిగా వ్యతిరేకించిన ఇండియా 2017 మే 8 వ తేదీన ఐసీజే ను ఆశ్రయించింది. అయితే, ఐసీజేలో ఇండియాకు అనుకూలంగా తీర్పు వచ్చింది. కుల్ భూషణ్ జాదవ్ పై మోపబడిన ఆరోపణలు సంబంధించిన పూర్తి సాక్ష్యాధారాలతో నిరోపించేవరకు ఆయన్ను ఉరితీయకూడదు అని పేర్కొంది. అయితే, ఇప్పుడు పాక్ కొత్త ఎత్తులు వేయడం మొదలుపెట్టింది. కుల్ భూషణ్ జాదవ్‌కు సంబంధించిన ఉరి శిక్షను రద్దు చేయాలని కోరుతూ క్షమాభిక్ష పై రివ్యూ పిటిషన్ వేయాలని కుల్ భూషణ్ పై ఒత్తిడి తీసుకొస్తోంది పాక్. ఈ పిటిషన్ దాఖలు చేస్తే, కుల్ భూషణ్ తప్పుచేసినట్టుగా ఒప్పుకున్నట్టే అవుతుంది. అందుకే పాక్ ఈ నాటకం ఆడుతున్నది. అయితే, కుల్ భూషణ్ మాత్రం ఈ రివ్యూ పిటిషన్ వేసేందుకు నిరాకరించినట్లు తెలుస్తోంది.

# మరోమారు తప్పించుకున్న గ్యాంగ్‌స్టర్

## -గుర్తించిన పోలీసులు

న్యూఢిల్లీ,జూలై9(ఆర్ఎన్ఎ): కాన్పూర్ గ్యాంగ్‌స్టార్ వికాస్ దూబే మరోసారి పోలీసుల నుంచి తప్పించుకున్నాడు. ఎనిమిది మంది పోలీసులను చంపి తప్పించుకు తిరుగుతున్న వికాస్ దూబే.. ఫరీదాబాద్‌లో ఉన్న బద్కాల్ చౌక్‌లోని శ్రీరామ్ హోటల్‌లో ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో హర్యానా క్రైమ్ బ్రాంచ్‌కు చెందిన పోలీసులు మంగళవారం రాత్రి ఆ హోటల్‌పై దాడి చేశారు. కానీ అతడు అప్పటికే అక్కడి నుంచి పరారయ్యాడు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించగా అతడు హోటల్ పరిసరాల్లో తిరిగినట్లు రికార్డయ్యింది. దీంతో సీసీటీవీ హార్డ్‌డిస్క్‌ను పోలీసులు తమవెంట తీసుకుపోయారు.

ఈ నెల 3వ తేదీన కాన్పూర్‌లో వీకాస్ దూబేను పట్టుకోవడానికి వెళ్లిన ఎనిమిది మంది పోలీసులను అతని ముఠా సభ్యులు కాల్చి చంపిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి అతడు తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) పోలీసులు గాలింపు చేపట్టారు. వికాస్ దూబేను వెతకడానికి ఉత్తరప్రదేశ్ పోలీసులు సుమారు 100కు పైగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

# ప్రజారోగ్యం కంటే సచివాలయమే ముఖ్యమా?

## -సర్కార్ తీరుపై జీవన్ రెడ్డి మండిపాటు

జగిత్యాల,జూలై9(ఆర్ఎన్ఎ): హైదరాబాద్‌లో సెక్షన్ 8 అమలును తాము కూడా కోరుకోవడం లేదని, కానీ సీఎం కేసీఆరే ఆ పరిస్థితిని కల్పిస్తున్నారని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం ఇక్కడ మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రజారోగ్యం క్షీణిస్తోన్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వానికి ప్రజారోగ్యం కంటే సచివాలయమే ముఖ్యం అయిందని విమర్శించారు. అందువల్లనే గవర్నర్‌ను తన అధికారాలను వినియోగించుకోవాలని కోరుతున్నామని జీవన్ రెడ్డి చెప్పుకొచ్చారు. సెక్షన్ 8 అధికారాలు తెలంగాణ గవర్నర్‌కే ఉంటాయని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ కోసం మాత్రమే పునర్విభజన చట్టంలో సెక్షన్ 8ని పొందుపర్చలేదని అన్నారు. ఇదే సమయంలో కరోనా వైద్యాన్ని ఆరోగ్యశ్రీలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# అవసరమైతే తప్ప బయటకు రావద్దు

## -మాస్కులు లేకుంటే వేయి జరిమానా: ఎస్పీ

నల్లగొండ,జూలై9(ఆర్ఎన్ఎ): కోవిడ్ - 19 నిబంధనలకు అనుగుణంగా మాస్కులు ధరించకపోతే జరిమానాలు తప్పవని ఎస్పీ ఏ.వి.రంగనాథ్ హెచ్చరించారు. జిల్లాలో కరోనా కేసుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటికి రావాలని, బయటికి వచ్చే సమయంలో విధిగా మాస్క్ ధరించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మాస్కులు ధరించకుండా బయటికి వచ్చే వారికి వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తామని అన్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో మాస్కులు ధరించని 599 మందికి జరిమానాలు విధించామని వెల్లడించారు. జిల్లాలోని ప్రజలంతా స్వీయ నియంత్రణ పాటించాలని, బయటికి వస్తే మాస్క్ విధిగా ధరించాలని సూచించారు. కరోనా నియంత్రణ కోసం పని చేస్తున్న పోలీస్, వైద్య శాఖ, సానిటరీ సిబ్బందితో ప్రజలంతా సహకరించాలని కోరారు

# పురోగామిలో ఏపి వ్యవసాయరంగం

## ఏడాదిలోగా విత్తన శుద్ధి కేంద్రాల ఏర్పాటు: కన్నబాబు

విశాఖపట్నం,జూలై9(ఆర్ఎన్ఎ): దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగం ఏడాదిలోనే అభివృద్ధి చెందిందని వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబు పేర్కొన్నారు. ఏడాదిలోనే విత్తన శుద్ధి కేంద్రాలు పూర్తి చేస్తామని తెలిపారు. చెరుకు రైతులకు 55 కోట్ల బకాయిలు ముఖ్యమంత్రి చెల్లించారన్నారు. మంత్రి గురువారం మాట్లాడుతూ.. చెక్కర కర్మాగారాలు అభివృద్ధి చేయడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెరకు రైతులకు ఆదుకున్నారన్నారు. చోడవరం చెరకు ఫ్యాక్టరీ కోసం ఇప్పటి వరకు ఏడాది కాలంలో 96 కోట్లు నిధులు మంజూరు చేశారని మంత్రి తెలిపారు. చోడవరం షుగర్స్‌లో 140 కోట్ల పంచదార నిల్వ ఉంచగా వెంటనే కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు.

# చైనాపై కత్తులు నూరుతున్న అమెరికా

## వ్యూహాత్మక చర్యలపై ట్రంప్ కసరత్తు

## సరైన సమయంలో చర్య తీసుకోనున్నట్లు కేలే మెకానీ వెల్లడి

వాషింగ్టన్,జూలై9(ఆర్ఎన్ఎ): ప్రాణాంతక కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో చైనాపై అగ్గిమీద గుగ్గిలం అవుతున్న అమెరికా కఠిన చర్యలకు ఉపక్రమించనున్నట్లు తెలుస్తోంది. మహమ్మారి వ్యాప్తితో పాటు వివిధ అంశాల పట్ల డ్రాగన్ దుందుడు వైఖరికి తగిన సమాధానం చెప్పేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అయితే ఎలాంటి చర్యలు ఉంటాయన్నది తెలియకపోయినా అందుకు ట్రంప్ తగిన వ్యూహం పన్నుతు న్నారని తెలుస్తోంది. చైనా తీరుపై ప్రపంచవ్యాప్తంగా కూడా నిరసనలు వస్తున్నాయి. వైట్‌హౌజ్ ప్రెస్ సెక్రటరీ కేలే మెకానీ బుధవారం ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. చైనాపై అధ్యక్షుడు ఎలాంటి చర్యలు తీసుకోనున్నారో ఇప్పుడే చెప్పలేను. అయితే సరైన సమయంలో చైనాపై తీసుకోనున్న చర్యలపై కొన్ని రోజుల్లోనే ఓ వార్త వినబోతున్నారు. అది మాత్రం కచ్చితంగా చెప్పగలనని పేర్కొన్నారు. కాగా చైనాలోని వుహాన్ నగరంలో తొలిసారిగా వెలుగు చూసిన కరోనా కారణంగా ప్రపంచమంతా ఉక్కిరిబిక్కిరి అవుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా అగ్రరాజ్యం అమెరికాపై ఇది తీవ్ర ప్రభావం చూపింది. ఇప్పటికే అక్కడ దాదాపు ముప్పై లక్షల మందికి కరోనా సోకగా.. సుమారు లక్షన్నరకు పైగా కోవిడ్ మరణాలు సంభవించాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా మహమ్మారి గురించి ముందే సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి, డ్రాగన్‌కు మద్దతుగా నిలిచారంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థపై కూడా మండిపడ్డారు. ఈ క్రమంలో అగ్రరాజ్యం నుంచి డబ్ల్యూహెచ్‌ఓకు అందే నిధులు సైతం నిలిపివేశారు.

అదే విధంగా గత కొన్ని నెలలుగా అమెరికా- చైనాల మధ్య వాణిజ్య యుద్ధం నెలకొన్న వేళ.. ప్రపంచ వాణిజ్య ప్రధాన కేంద్రాల్లో ఒకటిగా పేరొందిన హాంకాంగ్‌ను తమ గుప్పిట్లోకి తెచ్చుకున్న డ్రాగన్‌పై అగ్రరాజ్యం గుర్రుగా ఉంది. హాంకాంగ్ స్వయంప్రతిపత్తిని రద్దు చేసేలా చైనా అక్కడ ప్రవేశపెట్టిన జాతీయ భద్రతా చట్టంపై విరుచకుపడింది. ఈ నేపథ్యంలో హాంకాంగ్‌కు అమెరికా కల్పించిన ప్రత్యేక వెసలుబాట్లను రద్దు చేయాలని తన పాలనా యంత్రాంగాన్ని ఆదేశించినట్లు ట్రంప్ ఇంతకుముందే స్పష్టం చేశారు. నేరస్తుల అప్పగింత, ఎగుమతుల నియంత్రణ, సాంకేతికత ఉమ్మడి వినియోగం తదితర పలు కీలక ఒప్పందాలపై ఇది ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఇక వీటితో పాటు అమెరికా జర్నలిస్టులపై ఆంక్షలు, ఉగర్ ముస్లింల పట్ల చైనా వ్యవహరిస్తున్న తీరు, టిబెట్‌పై డ్రాగన్ విధానం తదితర అంశాలపై కూడా అగ్రరాజ్యం ఆగ్రహంగా ఉంది. ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా చోటుచేసుకుంటున్న పరిణామాలపై వైట్‌హౌజ్ ప్రెస్ సెక్రటరీ కేలే మెకానీ బుధవారం స్పందించారు. అయితే ఇటీవల వైట్‌హౌజ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్, జాతీయ భద్రతా సలహాదారు రాబర్ట్ ఓ బ్రెయిన్, విదేశాంగ మంత్రి మైక్ పాంపియో చేస్తున్న వ్యాఖ్యల గురించి స్పందించేందుకు కేలె నిరాకరించారు. జాతీయ భద్రత, ప్రజల గోప్యత హక్కుకు భంగం వాటిల్లే ప్రమాదం ఉన్నందున టిక్‌టాక్, వీచాట్ తదితర చైనా యాప్‌లపై నిషేధం విధించనున్నట్లు మైక్ పాంపియో, ఓ బ్రెయిన్ సంకేతాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. అంతేగాక చైనా కమ్యూనిస్టు పార్టీ తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక భారత్- చైనా సరిహద్దుల్లో ఘర్షణ వాతావరణం నెలకొన్న వేళ డ్రాగన్ దుందుడుకు చర్యలను ఖండించిన పాంపియో.. అవసరమైతే భారత్‌కు మద్దతుగా అమెరికా బలగాలు రంగంలోకి దిగుతాయంటూ కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అదే విధంగా హాంకాంగ్ విషయంలో చైనా కమ్యూనిస్టు పార్టీ అనుసరిస్తున్న విధానాలపై మండిపడ్డ ఓ బ్రెయిన్.. డ్రాగన్ ఆగడాలకు అడ్డుకుంటామని, వారి ఆటలు సాగనివ్వమని చెప్పుకొచ్చారు.

# ఏపి ప్రభుత్వం కీలక నిర్ణయం

## ఆరోగ్యశ్రీలో కరోనా చికిత్సలు చేరిక

## సిఎం జగన్ నిర్ణయంపై సర్వత్రా హర్షం

## పేదలకు వరం కానున్న ప్రైవేట్ వైద్యం

అమరావతి,జూలై9(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో కరోనా చికిత్సను చేర్చి ఆదర్శంగా నిలిచింది. సామాన్య కరోనా లక్షణాలు గల రోగికి మూడువేల రూపాయల నుండి పూర్తి వెంటిలేటర్ సౌకర్యంతో వైద్య చికిత్స అందించే రోగికి పదివేల రూపాయల లోపు ఆరోగ్య బీమాను ఆరోగ్యశ్రీలో అందిస్తున్నట్లు ప్రకటించారు. ఇది మంచి నిర్ణయం అని సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాజా నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ,ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని అంతా అభినందిస్తున్నారు. సిపిఐ కార్యాదర్శి నారాయణ తదిరులు సిఎం నిర్ణయాన్ని స్వాగతించారు. ఆంధ్రప్రదేశ్లో ఇప్పటికే పది లక్షలకు పైగా కరోనా టెస్టులు పూర్తిచేశారు. కోవిడ్ బాధితులకు ఇప్పటివరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చికిత్స అందుతుండగా ఇకపై ప్రైవేట్ ఆస్పత్రుల్లో నూ వైద్యానికి అనుమతించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం కొన్ని ప్రైవేట్ వైద్య కళాశాలల్లోనూ ప్రభుత్వపరంగా కోవిడ్ బాధితులకు చికిత్స అందుతోంది. వైద్యం, మందుల ఖర్చును ప్రభుత్వమే భరిస్తుండటంతో ఇక్కడ కూడా రోగులకు ఉచితంగా సేవలందుతున్నాయి. అయితే దేశ వ్యాప్తంగా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో డబ్బు చెల్లించి వైద్యం చేయించుకునే స్థోమత ఉన్న వారికి ప్రైవేట్ ఆస్పత్రుల్లో నూ కరోనాకు చికిత్స పొందేందుకు వీలు కల్పిస్తూ వైద్యారోగ్యశాఖ నిర్ణయం తీసు కుంది. ఈ మేరకు ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డా.కె.ఎస్ జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులిచ్చారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్సకు నిర్దేశిరచిన మేరకే ఫీజులు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ పరిధిలో ఉంటే చికిత్స ఖర్చును ప్రభుత్వమే చెల్లిస్తుంది. దీనిపై ప్రభుత్వం జవహర్‌రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక కమిటీని నియమించి ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో గుర్తించిన ఆస్పత్రులు అంటే ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో ప్రతి కోవిడ్ పేషెంటుకూ ఉచితంగానే వైద్యం అందుతుంది. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ జాబితాలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రుల్లో బీపీఎల్ కుటుంబాలు, లేదా ఏపీఎల్‌లో ఉన్న వారికి ఉచితంగా సేవలు అందిస్తారు. వీరికి వైద్యమందించినందుకు నిర్దేశిరచిన రేట్ల ప్రకారం ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఇవిగాకుండా ఆరోగ్యశ్రీ పరిధిలో లేని ప్రైవేట్ ఆస్పత్రులకు ఎవరైనా వెళ్లి వైద్యం చేయించు కోవాలనుకుంటే వారికి ప్రభుత్వం చెల్లించదు. వైద్యం పొందిన వారే చెల్లించాలి. అలాంటి ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ జాబితాలో చేరదలిస్తే ఆయా జిల్లాల కలెక్టర్ల అదేరోజు అనుమతులు మంజూరు చేయవచ్చు. కోవిడ్ సేవలు అందించే ప్రైవేటు ఆస్పత్రులు కనీసం 70 పడకల కంటే ఎక్కువ కలిగి ఉండాలి. పేషెంట్ల వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా వైద్యాధికారులకు పంపించాలి. రోగులకు శస్త్రచికిత్స, ప్రసవం లాంటి పరిస్థితుల్లో ఆర్టీపీసీఆర్ లేకుండా తక్షణమే వైద్యం చేయాలి. ఆ తర్వాత పరీక్షల్లో పాజిటివ్ అని తేలితే అధికార వర్గాలకు తెలియజేయాలి. ప్రైవేట్ ఆస్పత్రుల నియంత్రణ, పర్యవేక్షణ బాధ్యత పూర్తిగా కలెక్టర్లకు అప్పగించారు. ఈ ప్రక్రియ నిర్వహణకు కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆధ్వర్యంలో వెబ్‌పోర్టల్ పనిచేస్తుంది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇక్కడ తక్కువ. చాలా రాష్ట్రాల్లో కోవిడ్ చికిత్సకు అయ్యే ఖర్చులను పరిశీలించాకే ఈ ఫీజులు నిర్ణయించామని కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కాటమనేని భాస్కర్ వెల్లడించారు. ఆరోగ్యశ్రీ కార్డు లేకపోయినా జాబితాలో ఉన్న ఆస్పత్రులకు వెళితే ప్రభుత్వమే భరిస్తుంది.

# కరోనా కట్టడిలో సర్కార్ విఫలం

## ప్రజలుఆవేద చెందుతున్నా పట్టించుకోని ప్రభుత్వం

## మరోమారు మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు బండి

హైదరాబాద్,జూలై9(ఆర్ఎన్ఎ): కరోనా కట్టడిలో తెలంగాణ ప్రభుత్వం విఫలం చెందిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. కరోనా మరణాలు పెరుగుతున్నా ప్రభుత్వానికి పట్టడంలేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ప్రజలను గాలికొదిలేసింది కాబట్టే.. కరోనా కట్టడికి గవర్నర్ జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. దేశంలో ఎక్కడా గవర్నర్ ఆస్పత్రులను పరిశీలించిన పరిస్థితి లేదని పేర్కొన్నారు. గవర్నర్ స్వయంగా రంగంలోకి దిగి ఆస్పత్రులను పరిశీలించారని, ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో చర్చించారని అన్నారు. కరోనా కట్టడికి కేంద్రం కూడా ప్రత్యేక నిధులు కేటాయించిందని తెలిపారు. ఆస్పత్రుల్లో బెడ్స్ లేక కరోనా బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. ఇతర రాష్ట్రాల్లో చేసినన్ని కరోనా టెస్టులు తెలంగాణలో చేయటంలేదని విమర్శించారు. తీరా ప్రశ్నిస్తే ఐసీఎంఆర్ గైడ్ లెన్స్ పేరుతో మంత్రులు ఎదురుదాడి చేయటం దారుణం అన్నారు. ప్రభుత్వంపై నమ్మకం లేకనే ప్రజలు సమస్యల పరిష్కారం కోసం రాజ్‌భవన్ బాట పట్టారని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి ఏ మేరకు సాయం అందిందీ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వివరించారని అన్నారు. రాష్ట్రంలో ఆస్పత్రుల్లో దారుణాలపై ప్రజలు ఆవేదనగా వీడియోలు విడుదల చేస్తున్నా పట్టించుకోవడం లేదని బండి సంజయ్ అన్నారు.

నేరాలు తగ్గాయనడం అవాస్తవమన్న రాజాసింగ్

నగరంలో నేరాలను నియంత్రించడంలో పోలీసులు విఫలమయ్యారని బిజెపి ఎమ్మెల్యే రాజా సింగ్ విమర్శలు గుప్పించారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ నగరంలో ఈ ఆరు నెలల్లో క్రైమ్ రేట్ తగ్గింది అని పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ చేసిన ప్రకటన సత్యదూరం అన్నారు. ఇటీవలే వరుసగా ఐదారు హత్యలు నమోదయిన విషయాన్ని రాజాసింగ్ ప్రస్తావించారు. సిపి అంజనీకుమార్‌కు గుర్తు చేస్తున్న.. 20 రోజుల్లోపే 6 హత్యలు జరిగాయి. చోరీలు, హత్యలు, అత్యాచారాలు ఎన్ని జరిగాయో మీరే చెప్పాలని రాజాసింగ్ డిమాండ్ చేశారు. ఈ క్రైమ్ రేట్ తగ్గినట్లు ప్రకటనలు పోలీస్ కమిషనర్ ఇస్తున్నారా? ఫామ్ హౌస్‌లో కూర్చొని క్రైమ్ తగ్గినట్లు చెప్పమని పెద్దలు ఆదేశిస్తున్నారా ? అర్థం కావడం లేదంటూ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యానించారు. నగరంలో శాంతిభద్రతలు తగ్గాయని ఎలా అనగలరని ప్రశ్నించారు.

# కిరణ్‌బేడీకి కరోనా నెగిటివ్

పాండిచ్చేరి,జూలై9(ఆర్ఎన్ఎ): కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీకి కరోనా సోకలేదని నిర్ధారణ అయింది. గవర్నర్ అధికారిక నివాసం రాజ్ నివాస్‌లో పనిచేసే ఓ ఉద్యోగికి కరోనా పాజిటివ్‌గా తేలడంతో అధికారులు అలర్ట్ అయ్యారు. దీంతో కిరణ్ బేడీకి వైద్య పరీక్షలు నిర్వహించగా కోవిడ్-19 నెగెటివ్‌గా నిర్ధారణ అయిందని గవర్నర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. కరోనా పాజిటివ్ వ్యక్తితో కాంటాక్ట్ అయిన వారంతా హోం క్వారంటైన్‌లో ఉండాలని సూచించింది. గవర్నర్ బంగ్లాలో పనిచేసే సిబ్బందిలో ఒకరికి కరోనా నిర్ధారణ కావడంతో 48 గంటల పాటు కార్యాలయాన్ని మూసివేసి శానిటైజ్ చేశారు.




విశాఖ బీచ్‌లో మొక్కలు నాటిన ఎంపి విజయసాయి రెడ్డి

# సప్తగిరితో పాటు సజీవ సువార్త

## పత్రిక రాకపై పోలీసుల విచారణ

గుంటూరు,జూలై9(ఆర్ఎన్ఎ): తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) సప్తగిరి మాసపత్రిక వివాదంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ మేరకు పత్రిక చందాదారుడు రత్నవిష్ణు నివాసానికి తిరుపతి పోలీసులు వచ్చారు. సప్తగిరి మాసపత్రికతోపాటు సజీవ సువార్త అనే పుస్తకం రావడంపై వివరాలు సేకరిస్తున్నారు. తితిదే ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరుపుతున్నారు. తితిదే ప్రచురించే సప్తగిరి మాసపత్రికతో పాటు సువార్త పుస్తకం కూడా ఒకే పోస్టల్ కవర్‌లో అందినట్లు గుంటూరులోని మల్లికార్జున పేటకు చెందిన రత్నవిష్ణు తితిదే విజిలెన్స్ సెల్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇప్పుడు విచారణ జరుగుతోంది సప్తగిరి పుస్తక వ్యవహారంపై తిరుపతి ఎస్ఐ వీరేశ్ మాట్లాడుతూ.. సప్తగిరి పుస్తకంతో పాటు సువార్త పుస్తకం వచ్చిందని తమకు తెలిసిందన్నారు. గుంటూరు మల్లికార్జునపేటలో పత్రిక తీసుకున్న విష్ణును ప్రశ్నించామని, పుస్తకం అందిన వెంటనే ఇంట్లోకి వెళ్లి చూస్తే సువార్త సజీవ పుస్తకం కూడా ఉందని విష్ణు చెబుతున్నారని వీరేశ్ తెలిపారు. బుక్ పోస్టులో వస్తే కవర్ అంటించి ఉండదని చెప్పారు. ఈ వ్యవహారంలో పోస్ట్‌మేన్‌ను కూడా ప్రశ్నిస్తామని చెప్పారు. పూర్తి విచారణ తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ప్రగతిభవన్ వద్ద అనూహ్య ఘటన

## మా సిఎం ఎక్కడ అంటూ ఇద్దరు యువకుల నిరసన

## సిసి ఫుటేజ్ ఆధారంగా పట్టుకునేందుకు పోలీసుల యత్నం

హైదరాబాద్,జూలై9(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ అధికారిక నివాసమైన ప్రగతిభవన్ వద్ద అనూహ్య ఘటన చోటు చేసుకుంది. అకస్మాత్తుగా ఇద్దరు యువకులు మెరుపు నిరసనకు దిగారు. ప్రగతిభవన్ ఎగ్జిట్ వైపు బైక్‌పై వెళ్లిన యువకులు.. సీఎం కేసీఆర్ ఎక్కడ?.. ఆయన మా సీఎం. ఆయన ఎక్కడ ఉన్నడో తెలుసుకోవడం మా హక్కు అంటూ ఇంగ్లీష్‌లో రాసిన ప్లేకార్డును ప్రదర్శించి వెళ్లిపోయారు. ఈ ఘటన మెరుపు వేగంతో జరగడం వల్ల పోలీసులు ఆ యువకులను పట్టుకోలేకపోయినట్లు తెలిసింది. యువకుల కోసం స్థానిక సీసీఫుటేజ్‌లను పరిశీలించడంతో పాటు వారిని పట్టుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

# నీరవ్‌మోడీ ఆస్తులను జప్తు చేసిన ఇడి

న్యూఢిల్లీ,జూలై9(ఆర్ఎన్ఎ): పారిపోయిన ఆర్థిక నేరగాడు, వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి చెందిన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. పారిపోయిన ఆర్థిక నేరగాళ్ల చట్టం కింద నీరవ్ మోదీకి సంబంధించిన రూ.329.66 కోట్ల ఆస్తులను జప్తు చేసినట్లు ఈడీ బుధవారం వెల్లడించింది. ముంబైలోని పంజాబ్ నేషనల్ బ్యాంకులో 200 కోట్ల అమెరికన్ డాలర్ల మోసానికి సంబంధించి నీరవ్ మోదీ, అతని మామ మెహుల్ చోక్సీతోపాటు మరికొందరిని ఈడీ విచారిస్తున్నది. ఈడీ జప్తు చేసిన నీరవ్ మోదీ ఆస్తుల్లో ముంబైలోని వర్లీలోగల ఓ భవనంలోని నాలుఉ ఎ÷-లాట్లు, సముద్ర తీరంలోని ఒక ఫాంహౌజ్, అలీబాగ్‌లోని ఖాళీ స్థలం, జైసల్మేర్‌లోని విండ్ మిల్లు, లండన్‌లోని ఒక ఫ్లాట్, యూఏఈలోని రెసిడెన్షియల్ ఫ్లాట్లు, షేర్లు, బ్యాంకు డిపాజిట్లు ఉన్నాయి. ఈ విషయాలను ఈడీ ఒక ప్రకటనలో పేర్కొన్నది. ముంబైలోని స్పెషల్ కోర్టులో డిసెంబర్ 5న నీరవ్ మోదీని పారిపోయిన ఆర్థిక నేరగాడిగా ప్రకటించింది. గత నెల 8న అదే కోర్టు ఈడీకి నీరవ్ మోదీ ఆస్తులను జప్తు చేసే అధికారం ఇచ్చింది. 49 ఏండ్ల నీరవ్ మోదీ ప్రస్తుతం యునైటెడ్ కింగ్ డమ్‌లోని జైల్లో ఉన్నాడు. 2019 మార్చిలో లండన్‌లో అరెస్టయినప్పటి నుంచి మోదీ జైల్లో గడుపుతున్నాడు.

# పాతబస్తీలో దోపిడీ దొంగల అరెస్ట్

## -ప్లాన్ చేసి దొంగతనాలు చేస్తారన్న సిపి

హైదరాబాద్,జూలై9(ఆర్ఎన్ఎ): అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో దోపిడి దొంగల ముఠాను బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ అంజనీ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. ఐదుగురు సభ్యుల ముఠా ఈ నెల 4న దోపిడికి ప్లాన్ చేశారని.. పుత్లిబౌలిలో ఒక వ్యాపారి తీసుకువెళుతున్న మనీబ్యాగ్‌ను చోరీ చేశారన్నారు. కాగా బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చోరీకి పాల్పడ్డ ఐదుగురు దొంగల ముఠా సభ్యులలో సయ్యద్ పాషా, సయ్యద్ ఫయాజ్ ఇమ్రాన్, అమీర్ ఖాన్‌తో పాటు వసీంను అరెస్ట్ చేయగా ఒక్కరు మాత్రం పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. కాగా నిందితుల నుంచి 2.65 లక్షల నగదు, 2 డాగర్స్ , 10 మొబైల్ ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ముఠా సభ్యులపై గతంలోనూ హత్య, చోరీ కేసులు ఉన్నట్లు తెలిపారు. సైబరాబాద్, హైదరాబాద్ పరిధిలోని 4 పోలీస్ స్టేషన్‌లో వీరిపై వివిధ కేసులు నమోదైనట్లు తెలిపారు.

# హైకోర్టు మూసివేత వార్తలు అవాస్తవం

## పుకార్లుగా ప్రకటించిన రిజిస్ట్రార్ జనరల్

హైదరాబాద్,జూలై9(ఆర్ఎన్ఎ): తెలంగాణ హైకోర్టు మూసివేతపై వార్తలను హైకోర్టు రిజిస్ట్రార్ ఖండించారు. హైకోర్టు పనులు యథావిధిగా కొనసాగుతాయని రిజిస్ట్రార్ జనరల్ ప్రకటించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ కొనసాగుతోందని తెలిపారు. తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం నుంచి హైకోర్టు మూసివేయాలని నిర్ణయం తీసుకున్నారని, హైకోర్టును పూర్తిగా శానిటైజ్ చేయాలని న్యాయమూర్తులు ఆదేశించారని ప్రచారం జరిగింది. అయితే ఆ ప్రచారాన్ని హైకోర్టు రిజిస్ట్రార్ ఖండించింది. హైకోర్టులో కొందరికి పాజిటివ్ రావడంతో మూసేస్తున్నారన్న ప్రచారం సాగింది.

# ఇసిఐఎల్ చౌరస్తాలో విషాద ఘటన

## రోడ్డుపైనే కుప్పకూలి చనిపోయిన యువకుడు

హైదరాబాద్,జూలై9(ఆర్ఎన్ఎ): ఈసీఐఎల్ చౌరస్తాలో బుధవారం మధ్యాహ్నం హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. చూస్తుండగానే ఓ యువకుడు రోడ్డుపై కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన అతన్ని ఆస్పత్రికి తరలించేయత్నం చేసినప్పటికీ లాభం లేకపోయింది. యువకుడు అప్పటికే మృతి చెందినట్టు 108 సిబ్బంది నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. యువకుడి వెంటే ఉన్న అతని తల్లి, చెల్లి, భార్య గుండెలవిసేలా రోదించారు. మృతుడు జవహర్ నగర్ కు చెందిన పృథ్వీరాజ్‌గా తెలిసింది. మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న అతన్ని స్థానికంగా ఉండే జీనియా ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. జీనియా ఆస్పత్రి సిబ్బంది వైద్యం అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. మరో ఆస్పత్రికి తీసుకెళ్లండని ఉచిత సలహా ఇచ్చారు. దీంతో గత్యంతరం లేక యువకుడిని తీసుకుని కుటుంబ సభ్యులు బయటికొచ్చారు. వేరే ఆస్పత్రికి తీసుకెళ్దామని ఆటో కోసం చూస్తున్నారు. అంతలోనే ఘోరం జరిగిపోయింది. యువకుడు అనూహ్యంగా కిందపడి మృత్యువాత పడ్డాడు. పృథ్వీరాజ్‌ను ఆస్పత్రికి తరలించేందుకు సాయం కోసం ఎంత అర్థించినా ఎవరూ ముందుకురాలేదని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. కరోనా భయాలతో సాటిమనిషిని పట్టించుకోవడం మానేశారని వాపోయారు.

# కరోనా టెస్టుల కోసం జనాల పడిగాపులు

హైదరాబాద్,జూలై9(ఆర్ఎన్ఎ): కరోనా పరీక్షల విషయంలో అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టెస్టింగ్ సెంటర్లవద్ద రోజులు తరబడి తిరుగుతున్నా ఫలితం ఉండడంలేదని అంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కరోనా టెస్టింగ్ కిట్ల కొరత వెంటాడుతోంది. గత పది రోజులుగా నగరంలో ఫీవర్ ఆస్పత్రి, నేచర్ క్యూర్, ఎర్రగడ్డ ఆయుర్వేదిక్ ఆస్పత్రి.. ఇలా నగరంలో ఉన్న టెస్టింగ్ సెంటర్లు ఉన్న ప్రతి చోట గంటల కొద్ది బాధితులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలంది. ఎర్రగడ్డ ఆయుర్వేదిక్ ఆస్పత్రిలో అయితే గత వారం రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. రోజుకు వందమందికి మాత్రమే పరీక్షలు చేస్తుండడంతో బాధితులు ప్రతి రోజు తెల్లవారు జాము 5 గంటలకు వచ్చి టోకెన్ తీసుకుని ఉంటున్నారు. అయితే కరోనా లక్షణాలు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు

# దర్గా ఉత్సవాల కోసం జోగలాంబ ఆలయం మూసివేత

జోగులాంబ గద్వాల,జూలై9(ఆర్ఎన్ఎ): జోగులాంబ గద్వాల జిల్లాలోలని అలంపూర్‌లోగల జోగులాంబ, బాలబ్రహ్మేంద్ర స్వామి ఆలయాన్ని ఈ నెల 13 నుంచి 19 వరకు మూసివేస్తున్నట్లు ఆలయ ఈఓ ప్రేమ్‌కుమార్ గురువారం ప్రకటించారు. ఆలయ సమీపంలో ఉన్న దర్గా ఉత్సవాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తారని తెలిపారు. కరోనా నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో ఆలయాన్ని వారంపాటు మూసివేసి, దర్శనాలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కాగా, జోగులాంబ, బాలబ్రహ్మేంద్రస్వామివార్లకు త్రికాల పూజలు యధావిధిగా నిర్వహించ నున్నట్లు చెప్పారు. అయితే భక్తులకు మాత్రం అనుమతి లేదన్నారు.

## నిరసన తెలిపిన యువకుల అరెస్ట్

హైదరాబాద్,జూలై9(ఆర్ఎన్ఎ): ప్రగతి భవన్ వద్ద ప్లకార్డుతో నిరసన తెలిపిన యూత్ కాంగ్రెస్ నాయకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం.. మధ్యాహ్నం బేగంపేటలోని ప్రగతి భవన్ నుంచి బయటకు వెళ్లే గేటు వద్దకు ద్విచక్రవాహనంపై ఇద్దరు యువకులు వచ్చారు. వారిలో వెనుక కూర్చున్న ఓ యువకుడు తన వెంట తెచ్చుకున్న ప్లకార్డును తీసుకుని ఇనుప గేటు వద్దకు వెళ్లి.. 'కేసీఆర్ ఎక్కడ? ఆయన నా ముఖ్యమంత్రి, ఆయన ఎక్కడ ఉన్నారో తెలుసుకోవడం నా హక్కు' అంటూ రాసిన ప్లకార్డును చూపుతూ మెరుపు నిరసన తెలిపాడు. పోలీసులు తేరుకునే లోపే బయట ఎదురుచూస్తున్న తన అనుచరుడి బైకుపై కూర్చుని పరారయ్యాడు. సిసి ఫుటేజీ ఆధారంగా వారిని గుర్తించి పట్టుకున్నారు.

# కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దారుణం

## బిజెపి నేత సహా కటుంబ సభ్యుల కాల్చివేత

శ్రీనగర్,జూలై9(ఆర్ఎన్ఎ): జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోమారు దారుణానికి తెగించారు. రెచ్చిపోయిన ఉగ్రవాదులు బీజేపీ నేతను, అతని కుటుంబ సభ్యులను కాల్చారు. బుధవారం రాత్రి బీజేపీ నేత షేక్ వసీమ్‌తోపాటు అతని తండ్రిని, సోదరుడిని ముష్కరులు పొట్టన పెట్టుకున్నారు. జమ్ము కశ్మీర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బందీపోర్‌లో బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో వసీమ్ బరి కుటుంబం పోలీస్ స్టేషన్‌కు దగ్గరలోని ఓ దుకాణం దగ్గర కూర్చుంది. సరిగ్గా అదే సమయంలో అదును చూసి అక్కడకు చొరబడ్డ ఉగ్రవాదులు బీజేపీ నేతతో సహా అతని తండ్రి బషీర్ అహ్మద్, సోదరుడు ఉమర్ బషీర్‌పై కాల్పులు జరిపారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు వీరిని జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నిజానికి వసీమ్‌కు భద్రత సౌకర్యం ఉంది. కానీ ప్రమాదం జరిగే సమయంలో అతనికి భద్రతగా ఉండే ఎనిమిదిమంది గార్డుల్లో ఏ ఒక్కరూ సంఘటనా స్థలంలో లేరు. దీంతో నిర్లక్ష్యంగా వ్యవహరించిన గార్డులపై కఠిన చర్యలను తీసుకోనున్నట్లు కశ్మీర్ ఐజీపీ విజయ్ కుమార్ తెలిపారు. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న ప్రధాని నరేంద్ర మోదీ బాధితుడి కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా ప్రగాఢ సానుభూతి తెలిపారు. వసీమ్ మరణం పార్టీకి తీరని లోటని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై బిజెపి ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ తీవ్రంగా మండిపడ్డారు. ఉగ్రవాదుల చర్యలతో ఓ యువనాయకుడిని బిజెపి కోల్పోయిందన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



సూర్యాపేట జిల్లా నాగారం మండలంలో ఎస్సీ అభివృద్ధి శాఖ ద్వారా లబ్దిదారులకు చెక్కులు అందచేసిన మంత్రి జగదీశ్వర్ రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్ కూడా ఉన్నారు.

# రైతాంగాన్ని సంఘటితం చేసేందుకే రైతువేదికలు

## రైతును రాజును చేసే లక్ష్యంతో కెసిఆర్ కృషి
## మంత్రి జగదీశ్వర్ రెడ్డి

సూర్యపేట,జూలై 9(ఆర్ఎన్ఎ): రైతాంగాన్ని సంఘటితం చేసేందుకే రైతు వేదికల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు. రైతును రాజును చేయడమే సీఎం కేసీఆర్ సంకల్పమని చెప్పారు. ఇందులో భాగంగా బడ్జెట్‌లో 50శాతం నిధులు వ్యవసాయ రంగానికే కేటాయించారని గుర్తు చేశారు. గురువారం తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తొండ, వర్ధమానుకోట గ్రామాల్లో రూ.22లక్షల అంచనాలతో నిర్మించతలపెట్టిన రైతు వేదికల నిర్మాణానికి మంత్రి జగదీశ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే ఎమ్మెల్యే గాధారి కిశోర్ కుమార్‌తో కలిసి నాగారం మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాల ఆవరణలో ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన లబ్ధిదారులకు ఆస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియంత్రిత సాగుపై దృష్టి సారించాలని రైతాంగానికి పిలుపునిచ్చారు.

స్థానిక శాసనసభ్యులు గాధారి కిశోర్‌కుమార్ మాట్లాడుతూ కక్షలు కార్పణ్యాలతో తల్లడిల్లిన తుంగతుర్తి నియోజకవర్గంలో పాడి పంటలు సస్యశ్యామలంగా ఉన్నాయంటే అది సీఎం కేసీఆర్ చలవేనని కొనియాడారు. అలాగే మంత్రి జగదీశ్‌రెడ్డి చూపిన చొరవ ప్రధాన కారణమన్నారు. ఆయా కార్యక్రమాల్లో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు ఎస్కే రజక్, జిల్లా వ్యవసాయాధికారి జ్యోతిర్మయి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

# మేడిపల్లిలో మెగా డెయిరీ నిర్మాణం

## 25కోట్లతో నిర్మించేందుకు సన్నాహాలు
## మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ వెల్లడి

హైదరాబాద్,జూలై 9(ఆర్ఎన్ఎ): రంగారెడ్డిజిల్లా మేడపల్లిలో రూ.250కోట్లతో మెగా డెయిరీ నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించిందని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఈ



మేడిపల్లిలో డెయిరీ నిర్మాణంపై మీడియాతో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్

ప్రాజెక్టుకు శ్రావణమాసంలో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడిన మంత్రి తలసాని పశుసంవర్ధకశాఖ చేపట్టబోయే పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. విజయా డెయిరీ ఉత్పత్తులను ప్రజలకు మరింత చేరువ చేసేలా ప్రతి చోటా ఔట్‌లెట్‌లను ఏర్పాటుచేస్తామన్నారు.పశువులకు కృత్రిమ గర్భదారణ పై త్వరలో రైతులకు అవగాహన కల్పించేందుకు మామిడిపల్లిలో 55 ఎకరాల్లో శిక్షణ కేంద్రం ఏర్పాటుచేస్తామని తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేయాలనేది ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పమని చెప్పారు. గొర్రెల పెంపకందారులు, పాడి రైతులు, మత్స్యకారుల అభివృద్ధి కోసం వందల కోట్లతో సంక్షేమ కార్యక్రమాననలు అమలుచేస్తున్నట్టుతెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రశంసించిందని అన్నారు. గొల్ల, కురుమల అభివృద్ధి కోసం చేపట్టిన గొర్రెల పంపిణీలో 50శాతం మందికి గొర్రెలను పంపిణీ చేసినట్టు చెప్పారు. మిగిలిన లబ్ధిదారులకు త్వరలో పంపిణీ చేస్తామన్నారు. బ్రాండెడ్ మటన్ విక్రయాల కోసం ఔట్‌లెట్‌ల ఏర్పాటుకు అధ్యయనానికి కమిటీని నియమించినట్టు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం 80 లక్షల గొర్రెలను పంపిణీ చేయగా పిల్లలతో కలుపుకుని వాటి సంఖ్య 2కోట్లకు చేరిందన్నారు. ముందస్తు చర్యలతో కరోనా, లాక్‌డౌన్ పరిస్థితుల్లో కూడా పాలు, పెరుగు కొరతరాకుండా చూడగలిగామని చెప్పారు. ఖమ్మం, వనపర్తిలలో ఒక్కో చోట 5 ఎకరాల విస్తీర్ణంలో పీప్స్ మార్కెట్‌ల నిర్మాణానికి 25 లక్షల రూపాయల చొప్పున నిధులు విడుదల చేస్తున్నామన్నారు. చేప పిల్లల కొనుగోలు, పంపిణీలో ఎంతో పారదర్శకంగా వ్యవహరిస్తున్నట్టు మంత్రి వెల్లడించారు.

# తమిళనాడులు పెరుగుతున్న కరోనా

## మరియమ్మన్ వేషధారణలో ప్రజల్లో చైతన్యం

చెన్నై,జూలై 9(ఆర్ఎన్ఎ): తమిళనాడులో కరోనా వైరస్ విలయతాండవం చేస్తోంది. దేశంలోనే పాజిటివ్ కేసుల్లో తమిళనాడు రెండో స్థానంలో ఉంది. అలాంటి తమిళనాడులో కరోనాపై అవగాహన కల్పించేందుకు పలువురు పలు రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా తమిళనాడు గ్రామీణ ప్రజలు బాగా విశ్వసించే.. మరియమ్మన్ దేవత వేషధారణలో ఓ మహిళ.. కరోనా వైరస్ పై విస్తృత అవగాహన కల్పించారు. ప్రజలకు మాస్కులు పంపిణీ చేశారు. మంచి ఆరోగ్యం, రోగనిరోధక శక్తి ప్రసాదించాలని కోరుతూ.. మరియమ్మన్ దేవతను అక్కడి ప్రజలు పూజిస్తారు. గ్రామీణ ఏరియాల్లోని కరోనా హాట్ స్పాట్ ప్రాంతాల్లో సుమారు 30 శాతం మంది ప్రజలు మాస్కులు ధరించడం లేదు. వారిని ప్రతి ఒక్కరూ చైతన్యపరుస్తున్నారు. కరోనా వైరస్ వ్యాప్తి చెందినప్పటి నుంచి పోలీసులు, సామాజిక కార్యకర్తలు ప్రజల్లో అవగాహన పెంపొందిస్తున్న విషయం విదితమే. పలు రాష్ట్రాల్లో యమధర్మరాజు వేషధారణల్లో వ్యక్తులు బయటకు వచ్చి ప్రజలకు కరోనాపై అవగాహన కల్పించారు.

# కాంగ్రెస్ కార్యకర్త అరెస్ట్‌పై రేవంత్ మండిపాటు

## కమిషనర్‌ను కలసి చర్చించిన ఎంపి

హైదరాబాద్,జూలై 9(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ కార్యకర్త సాయిబాబా అరెస్ట్ దారుణమని ఎంపీ రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణలో నిరసనలకు కూడా అవకాశం లేదా అని అన్నారు. ఈ మేరకు ఆయన కమిషనర్‌ను కలసి మాట్లాడారు. అంతకు ముందు పంజాగుట్ట ఏసీపీకి, ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేశానని రేవంత్ తెలిపారు. అయితే ఏసీపీ ఫోన్ లిఫ్ట్ చేయలేదని... అనంతరం ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేస్తే తాను లీవ్‌లో ఉన్నానని సమాధానం ఇచ్చారు. దీంతో కమిషనర్‌తో మాట్లాడానని రేవంత్ తెలిపారు. ప్లకార్డు పట్టుకుంటే అరెస్ట్ చేయడం దారుణమన్నారు. నిన్న రాత్రి నుంచి స్టేషన్‌లో ఎందుకు ఉంచారని ప్రశ్నించారు. కేసు ఫైల్ చేసి పంపించాలి కదా అని నిలదీశారు. కేసును పరిశీలించి వదిలేస్తామని కమిషనర్ తెలిపారని రేవంత్ పేర్కొన్నారు.

# ఆర్టీసీలో ఇక నగదు రహిత బుకింగ్‌లు

## ప్రథమ్ యాప్ ద్వారా బుకింగ్ సదుపాయం

విజయవాడ,జూలై 9(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల టికెట్ల జారీ ప్రక్రియను సులభతరం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నగదు రహిత లావాదేవీల ద్వారా టికెట్లు జారీ చేయాలని నిర్ణయించింది. దీని కోసం ప్రథమ్ అనే యాప్‌ను రూపొందించింది. ఈ నెల 20 నుంచి ప్రథమ్ యాప్ ద్వారా ఆర్టీసీ బస్సుల టికెట్లను జారీ చేయనున్నారు. ప్రయోగాత్మకంగా తొలుత 19 డిపోల పరిధిలో యాప్ ద్వారా టికెట్లు జారీ చేస్తామని ఆర్టీసీ ఎండీ మాదిరెడ్డి ప్రతాప్ తెలిపారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, నెల్లూరు, కర్నూలు-1, రాజమహేంద్రవరం, ఏలూరు, శ్రీకాకుళం-1, అనకాపల్లి, మచిలీపట్నం, విజయనగరం, గుంటూరు -1,2, అమలాపురం, రావులపాలెం, చిత్తూరు-2, తాడిపత్రి డిపోల్లో ప్రథమ్ యాప్ ద్వారా టికెట్లు జారీ చేస్తారు. కరోనా వ్యాపించకుండా కండక్టర్లు, డ్రైవర్లు ప్రత్యేక మొబైల్ సమకూర్చుకోవాలని ఆదేశించారు. సూచించిన ప్రమాణాల మేరకు స్మార్ట్ ఫోన్లు సమకూర్చుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సిబ్బందికి యాప్ సహా అవసరమైన సాఫ్ట్‌వేర్ అందిస్తామని ఎండీ తెలిపారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఈడీలు, ఆర్ఎంలకు ఎండీ మాదిరెడ్డి ప్రతాప్ ఆదేశించారు.

# కోవిడ్ ఆస్పత్రిగా చిన్నస్వామి స్టేడియం

## కర్నాటక సర్కార్ తక్షణ నిర్ణయం

బెంగళూరు,జూలై 9(ఆర్ఎన్ఎ): కర్నాటకలో కరోనా విజృంభిస్తున్నది. రోజుకు వెయ్యికిపైగా కేసులు నమోదవుతున్నాయి. మున్ముందు కేసుల మరింత పెరిగే అవకాశం ఉండడంతో చిన్నస్వామి స్టేడియంతో పాటు బెంగళూరు ప్యాలెస్‌ను కొవిడ్-19 కేర్ సెంటర్‌గా మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం గురువారం తెలిపింది. బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కొవిడ్-19 సంరక్షణ కేంద్రంగా మార్చింది. ఈ సందర్భంగా కేంద్రం ఇన్‌చార్జి ఆర్ అశోకమాట్లాడుతూ.. బెంగళూరు ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని పేర్కొన్నారు. బాధితులను సంరక్షించడానికి 600 అంబులెన్సులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ సమాచారం మేరకు.. కర్ణాటకలో ప్రస్తుతం 28,877 కరోనా పాజిటివ్ కేసులు ఉన్నాయి. వీటిలో 16,531 యాక్టివ్ కేసులుండగా, 11,876 మంది కోలుకున్నారు. ఇప్పటి వరకు 470 మంది వైరస్ బారిన పడి మరణించారు.

# కరానాతో భయపడొద్దు

## వైరస్ సోకిన వారికి ధైర్యం చెప్పాలి
## అవసరమైతే తప్ప బయటకు రావద్దు
## మంత్రి హరీష్ రావు సూచన

సిద్దిపేట,జూలై9(ఆర్ఎన్ఎ): కరోనా అంటే నిర్లక్ష్యం వద్దనీ, భయపడొద్దని.. పూర్తి జాగ్రత్తతో ఉండాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సూచించారు. పాజిటివ్ వస్తే ఏదో తప్పు చేసిన వారిలా చిన్నచూపు చూడకుండా ప్రేమ చూపాలన్నారు. వైరస్ సోకాలని ఎవరూ కోరుకోరని, అందరూ జాగ్రత్త పడుతూ.. మన జాగ్రత్తలో మనం ఉండాలని సూచించారు. గురువారం సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డులో రూ.2.20కోట్ల వ్యవయంతో నిర్మించనున్న సీసీరోడ్ల నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ రాజనర్సుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరోనా వైరస్ పాజిటివ్ వచ్చిన వారు మానసికంగా బాధపడుతుంటారని, సూటిపోటి మాటలతో ఇంకా కుంగిపోయి బలహీనపడుతున్నారని చెప్పారు. ఎవరికీ వైరస్ సోకొద్దని కోరుదాం.. వచ్చిన మనిషికి ధైర్యం చెప్పాలని, దీంతో రెండు రోజులు ఎక్కువ బ్రతికే అవకాశం ఉంటుందన్నారు. ఇలా పలు చోట్ల జరిగిన జరిగిన విషయాలు తన దృష్టికి వచ్చాయని మంత్రి తెలిపారు. ప్రజలు అవసరమైతే తప్ప ఇంట్లో నుంచి బయటకు రావొద్దని సూచించారు. ఉదయం.. మధ్యాహ్నం భోజనం వేళ అన్ని సమయాల్లో గోరు వెచ్చని నీళ్లు తాగితే సగం ఫికర్ తగ్గుతుందన్నారు. పసుపు, మిరియాలు వేసి ముఖానికి ఆవిరి పట్టుకోవాలని, రోజుకు రెండు మూడు సార్లు చేయాలని, నిమ్మరసం తాగాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా మనల్ని మనం రక్షించుకున్న వారమవుతామంటూ సూచనలు చేశారు. ఈ నెల 15న కరోనా పరీక్షా కేంద్రం ప్రారంభిస్తామని, వంద మందికి సేవలందించేలా కొవిడ్ ఆసుప్రతి ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 20 పడకలతో ఐసీయూ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. పట్టణంలోని 26వ మున్సిపల్ వార్డులో రూ.15 లక్షల వ్యయంతో కాలనీ కమ్యూనిటీ హాల్ కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. అనంతరం రూ.15 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన ప్రభుత్వ యునాని దవాఖానను ప్రారంభించారు. ప్రభుత్వ యునాని దవాఖానకు అవసరమైన అంశాలపై చర్చిస్తూ.. త్వరితగతిన ఆమోదం ఇవ్వాలని ఫోన్ లైనులో ఉన్నతాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఇంటర్ విద్యార్థులకు శుభవార్త

## ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు రద్దు
## అందరినీ పాస్ చేయాలని ప్రభుత్వం నిర్ణయం
## వెల్లడించిన విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్,జూలై 9(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను రద్దు చేసింది. కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులందరిని పాస్ చేస్తున్నట్లు మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ఈ నిర్ణయంతో 1.47 లక్షల విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుందని ఆమె చెప్పారు. కంపార్ట్‌మెంటల్‌లో ఉత్తీర్ణత అయినట్లు వీళ్లకు సర్టిఫికెట్స్ జారీ చేస్తామని ఆమె స్పష్టం చేశారు. వీళ్లందరూ ఈ నెల 31 వరకూ కూడా కాలేజీల్లో చేరొచ్చని సబిత చెప్పారు. ఇంటర్ పాస్ అయిన విద్యార్థులను కూడా రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోమని గతంలో చెప్పామని ఆమె తెలిపారు. 73 వేల మంది విద్యార్థులు రీకౌంటింగ్‌కు, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేశారని వెల్లడించారు. 10 రోజుల్లో రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ చేసి ఫలితాలు ఇస్తామని సబిత స్పష్టం చేశారు

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రద్దు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మార్చి 2020 ఇంటర్ సెకండియర్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులందరినీ పాస్ చేస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు. కరోనా నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఇపుడు పాసైన వారందరినీ కంపార్ట్ మెంట్లలో పాసైనట్టుగా గుర్తించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో1.47 లక్షల మంది విద్యార్థులకు ఊరట లభించనుంది. ఈ మేరకు విద్యార్థులకు జులై 31 తర్వాత సంబంధిత కళాశాలల్లో మార్కుల మెమోలు జారీచేస్తారని తెలిపారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఫలితాలను 10 రోజుల తర్వాత అందజేస్తామని మంత్రి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు.

కరోనా వైరస్‌ను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు తొలి దశలోనే 1 నుంచి 9 వరకు విద్యార్థులను పాస్ చేసింది తెలంగాణ ప్రభుత్వం. కొన్ని రోజుల క్రితం పదో తరగతి పరీక్షలను కూడా రద్దు చేసింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పరీక్షలు నిర్వహించే అవకాశం లేదు కాబట్టి అందరినీ పాస్ చేస్తున్నట్టు సబితా ఇంద్రారెడ్డి చెప్పారు.

# ఏడాదిన్నరలోగా విద్యారంగంలో పనులు పూర్తి

## ఎక్కడా నిధులకు కొరత రాకుండా పటిష్ట ప్రణాళిక
## నాడు-నేడు, సాగునీటి ప్రాజెక్టులు, వాటర్‌గ్రిడ్‌లపై సమీక్ష
## అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన సిఎం జగన్

అమరావతి,జూలై 9(ఆర్ఎన్ఎ): ఏడాదిన్నరలోగా విద్యారంగంలో నాడు-నేడు పనులు పూర్తి కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా భావిస్తున్న వీటి విషయంలో ఎక్కడా నిధులకు కొరత రాకుండా పటిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. నిధుల అనుసంధానంపై నిర్దిష్ట సమయంతో లక్ష్యాలను పెట్టుకుని ఖచ్చితమైన ప్రణాళికతో అడుగులు ముందుకేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు, సాగునీటి ప్రాజెక్టులు, వాటర్‌గ్రిడ్, మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులకు నిధుల అనుసంధానంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గురువారం ఉన్నత స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్ణీత సమయంలోగా లక్ష్యాలు, అంతే వేగంతో పనులు జరగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నాడు-నేడు కార్యక్రమం ప్రభుత్వానికి అత్యంత ప్రధానమని వైఎస్ జగన్ అన్నారు. విద్యారంగంలో నాడు-నేడు పనులకు ఇప్పటి వరకు విడుదల చేసిన నిధులు, ఇకపై సమీకరించాల్సిన నిధుల అంశాలపై సీఎం అధికారులకు మార్గనిర్దేశం చేశారు. మొదటి విడత నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా 15 వేలకు పైగా స్కూళ్లలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, దీని కోసం దాదాపు రూ.3600 కోట్లు ఖర్చు అవుతుందని, ఇప్పటికి రూ.920 కోట్లు విడుదల య్యాయని వెల్లడించారు. మిగిలిన నిధుల విడుదల కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15 నాటికి మొదటి విడత నాడు-నేడు కార్యక్రమాలకు మిగిలిన నిధులు ఇచ్చేందుకు ప్రణాళిక వేసుకోవాలన్నారు. అలాగే పాఠశాలలు సహా, హాస్టళ్లు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో రెండు, మూడో విడత కార్యక్రమాల కోసం రూ.7700 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేశామని అధికారులు సీఎంకు తెలిపారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా భావిస్తున్న పాఠశాలలు, ఆస్పత్రుల్లో నిధుల పరంగా ఇబ్బందులు రాకుండా, పటిష్టంగా ఈ కార్యక్రమం కొనసాగాలని వైఎస్ జగన్ ఆదేశించారు. ఏడాదిన్నర కాలంలో పాఠశాలల అభివృద్ధి విషయంలో మనం కన్న కలలు నిజం కావాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. విద్యారంగంలో నాడు-నేడు పనులపై తాము కన్న కల నిజం కావాలని అధికారులకు ముఖ్యమంతి సూచించారు. ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో కూడా నాడు-నేడు, కొత్తగా నిర్మించే నిర్మాణాలు అత్యంత ముఖ్యమైనదన్నారు. అక్టోబర్ 1 నుంచి రాయలసీమ కరువు నివారణా పనులు ప్రారంభించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు

రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ రక్షిత తాగునీటిని అందించే ప్రయత్నాల్లో భాగంగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. తొలిదశలో భాగంగా శ్రీకాకుళం జిల్లా ఉద్దానం, తూ.గో, ప.గో, గుంటూరులోని పల్నాడు, ప్రకాశం జిల్లాలోని కనిగిరి ప్రాంతం, చిత్తూరు జిల్లాలోని పశ్చిమ ప్రాంతం, కడప జిల్లాలో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకోసం రూ.19,088 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. దీనికి సంబంధించి నిధుల అనుసంధానంపై వైఎస్ జగన్‌కు వివరించారు. నిధుల సమీకరణ టై అప్ జరిగిందని తెలిపారు. వీటితోపాటు కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలోని 7 నియోజకవర్గాలతో పాటు, డోన్ నియోజకవర్గంలో కూడా వాటర్ గ్రిడ్ చేపట్టాలని జగన్ ఆదేశించారు. ప్రకాశం జిల్లాలోని మిగిలిన పశ్చిమ ప్రాంతంలోనూ, అనంతపురం జిల్లాలోనూ వాటర్ గ్రిడ్ పనులు చేపట్టాలని సీఎం అన్నారు. వీటికి సంబంధించి డీపీఆర్‌లు సిద్ధంచేసి టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. హైబ్రీడ్ యాన్యునిటీ (హెచ్.ఎ.ఎం.) విధానంలో చేపడుతున్న వాటర్ గ్రిడ్ పనులకు అక్టోబరు టెండర్లు ఖరారు చేస్తామని, ఆవెంటనే వర్క్ ఆర్డర్లు ఇస్తామని అధికారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు తెలిపారు. 16 కొత్త మెడికల్ కాలేజీలు, 1 సూపర్ స్పెషాల్టీ, 1 క్యాన్సర్ ఆస్పత్రి, 1 మానసిక చికిత్సాసుపత్రి కోసం రూ. 6657 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా. అలాగే ప్రస్తుతం ఉన్న 11 ఆస్పత్రులు, 6 అనుబంధ సంస్థలు, 7 మల్టీ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రుల కోసం మరో రూ.6099 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా. ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ ఆస్పత్రుల్లో నాడు?నేడు కార్యక్రమాల కోసం రూ.1,236 కోట్లు ఖర్చు అలాగే పీహెచ్‌సీల్లో కొత్త వాటి నిర్మాణం, ఉన్న వాటి పునరుద్ధరణ కోసం రూ.671 కోట్లు ఖర్చు కాగలదని అంచనా విలేజ్ క్లినిక్స్‌లో 11,197 కేంద్రాల పునరుద్ధరణ మరియు కొత్త వాటి నిర్మాణం కోసం రూ.1745 కోట్లు ఖర్చు కాగలదని అంచనా వేశారు. వీటికి నిధుల అనుసంధానంపైనా సీఎం అధికారులతో చర్చించారు. ఇప్పటికే నిధులు సమకూరిన వాటి పనులు వేగవంతం చేయాలని, మిగతా వాటికి నిధులు అనుసంధానం చేసుకుని ప్రణాళికతో ముందుకుసాగాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు.

సాగునీటి ప్రాజెక్టులు:

÷ాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న, చేపట్టబోయే ప్రాజెక్టుల కోసం దాదాపు రూ.98 వేల కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేశారు. వీటిలో రూ.72 వేల కోట్ల కొత్త ప్రాజెక్టుల కోసం ఖర్చు చేయన్నారు. రాయలసీమ ప్రాంతంలో కరువు నివారణ కోసం ఉద్దేశించిన పనుల కోసం ఖర్చు చేసే నిధుల కోసం ఆర్థిక సంస్థలు, బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్నామని, త్వరలో దీనికి సంబంధించి ÷నాన్షియల్ క్లోజర్ పూర్తవుతుందని అధికారులు వెల్లడించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అక్టోబరు 1 నుంచి రాయలసీమ కరువు నివారణ పనులు ప్రారంభం కావాలని, టెండర్లు వీలైనంత త్వరగా ఖరారు చేయాలని సీఎం ఆదేశించారు. రాయలసీమ కరువు నివారణ పనులతో పాటు, స్టేట్ వాటర్ సెక్యూరిటీ డెవలప్‌మెంట్ (పోలవరం చేపట్టాల్సిన నుంచి వరద జలాల తరలింపు), ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పల్నాడు ప్రాంతంలో కరువు నివారణ?తాగునీటి వసతి కల్పన, కృష్ణా?కొల్లేరు ప్రాంతం ఉప్పు నీటిమయం కాకుండా పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు.

ఏఐబీ ఆర్థిక సహాయం

పంచాయతీ రాజ్ విభాగంలో కొనసాగుతున్న రోడ్ల నిర్మాణ పనులపైనా ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. దీనికి ఏఐబీ ఆర్థిక సహాయం చేస్తోందని, మొత్తం రూ.4,456 కోట్లతో మారుమూల గ్రామాలకు రోడ్లను వేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 70శాతం టెండర్లు ఖరారై పనులు కొనసాగుతున్నాయని, మిగిలిన 30శాతం పనులకు త్వరలోనే టెండర్లు ఖరారు చేస్తామని చెప్పారు. రూ.5,350 కోట్లతో చేపడుతున్న కార్యక్రమాల పురోగతిని సీఎంకు అధికారులు వివరించారు. ఏఐబీతో నిధుల అనుసంధానం జరిగిందని అధికారులు వెల్లడించారు. రెండు ప్యాకేజీలకు సంబంధించి, రూ.1950 కోట్ల విలువైన పనులకు త్వరలోనే టెండర్లు ఖరారుచేస్తామన్నారు. ఏఐబీ దీనికి నిధులు సమకూరుస్తోందని తెలిపారు. రోడ్లు?భవనాల శాఖలో భాగంగా 'న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు'తో చేపట్టిన ప్రాజెక్టుల తొలిదశలో భాగంగా దాదాపు రూ.3200 కోట్లను దీని కోసం ఖర్చు చేస్తున్నారు. దీంట్లో భాగంగా 3,104 కి.మీ రహదారులు, 479 బ్రిడ్జిలు నిర్మించనున్నారు. మొదటి విడత పనులకు సంబంధించి 50శాతం డీపీఆర్‌లు తయారు అయ్యాయని, మిగిలినవి కూడా పూర్తవుతాయని తెలిపారు. వీటికీ టెండర్లు ఖరారుచేస్తామని అధికారులు వెల్లడించారు.

ముఖ్యమంతి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, సీఎస్ నీలం సాహ్ని, ఆర్థిక, విద్య, వైద్య, పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్అండ్‌బీ, జలవనరులశాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# అభివృద్ధి పనుల్లో ఆసల్యం తగదు

## డబుల్ ఇళ్ల నిర్మాణం సకాలంలో పూర్తి కావాలి
## కలెక్టరేట్‌లో సమీక్షించిన మంత్రి ఎర్రబెల్లి

వరంగల్,జూలై9(ఆర్ఎన్ఎ): అభివృద్ధి పనులు ఆలస్యమైతే క్షమించేది లేదని,నిర్ణీత గడువులోపు ఆయా పనులు ఖచ్చితంగా పూర్తి చేయాలని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లిదయాకర్‌రావు అధికారుల ఆదేశించారు. కరోనా కష్టకాలంలో సీఎం కేసీఆర్ ఎంతో శ్రమకోర్చి ప్రజల సంక్షేమం, అభివృద్ధి గురించి పరితపిస్తున్నారని అన్నారు. వరంగల్ రూరల్ కలెక్టరేట్‌లో గురువారం పర్వతగిరి, రాయపర్తి మండలాల డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, కల్లాలు, ప్రగతిలో ఉన్న పలు అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో వెనుకబడిన తెలంగాణను కొట్లాడి ప్రత్యేక రాష్ట్రంగా తెచ్చుకున్నామని, కేసీఆర్ ముఖ్యమంత్రి కావడంతో తెలంగాణ అభివృద్ధికి అద్భుత అవకాశాలు ఏర్పడ్డాయని అన్నారు. ఇప్పుడు కాకపోతే మరెప్పుడూ కాదనే విధంగా అభివృద్ధికి అనేక అవకాశాలు నిధులు వస్తున్నాయని చెప్పారు. వాటిని సద్వినియోగం చేయాల్సిన బాధ్యత అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులపై ఉందని అన్నారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు, కొత్తగా ఉపాధి హామీ కింద వచ్చిన కల్లాలను వేగంగా, నాణ్యతతో పూర్తిచేయాలని సూచించారు. రోడ్లు, కల్వర్టులు, కాలువల మరమ్మతులు వంటి అన్నిరకాల పనులను మంత్రి ఎర్రబెల్లి సమీక్షించారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణంలో జరుగుతున్న ఆలస్యం పై కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వాళ్లు అడిగినంత సమయం ఇచ్చామని, ఇసుక వంటి సమస్యలపరిష్కారానికి అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. మరో వైపు రూర్బన్ ప్రాజెక్ట్ కింద పర్వతిగిరికి మంజూరైన 30కోట్ల నిధులను ఏయే పనులకు ఎంతెంత ఖర్చు చేయాలన్న అంశం పై మంత్రి ఎర్రబెల్లి వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరిరమేష్‌తో కలిసి ఖరారు చేశారు. పర్వతగిరి మండలంలో మాత్రమే ఖర్చుచేయాల్సిన నిధులతో 50కి పైగా పనులను చేపట్టాలని నిర్ణయించారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.